

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 172 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 31 అక్టోబర్ 2025 | వెల : 4/-

# కాలం చెల్లిపోతున్న కాంగ్రెస్ గ్యారంటీలు






- అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారు
- తర్వాత రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేశారు.
- సమీప కాలంలో అమలు చేస్తామని కూడా చెప్పలేకపోతున్నారు
- దీంతో ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు
- కాంగ్రెస్ మేనిఫెస్టో 'అభయ హస్తం'లో ప్రకటించిన గ్యారంటీల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం ఉన్నాయి

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయంలో ఐదు గ్యారంటీలు కీలక పాత్ర పోషించాయి. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పి ఇక్కడ కూడా అవే హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారు. తర్వాత రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేశారు. దానిపైనా విమర్శలు ఉన్నాయి. ఇక ఎలాంటి గ్యారంటీని అమలు చేయలేదు. సమీప కాలంలో అమలు చేస్తామని కూడా చెప్పలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం - మిగతా3లో



దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు వెన్నెముక

## ఎన్‌డిఆర్‌ఎఫ్!

- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్
- కొత్త రకాల విపత్తులను ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిద్ధమైంది
- మీ త్యాగాలు దేశం ఎన్నటికీ మరువ వద్దు
- మీ ధైర్యం, అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తి
- ఈ ఒక్క ఏడాదిలోనే 1600 మంది ప్రాణాలను కాపాడారు
- 38 వేల మందిని సురక్షితంగా తరలించారు.
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.
- న్యూఢిల్లీలో ఎన్‌డిఆర్‌ఎఫ్ అమరవీరుల సంస్మరణ సభకు హాజరై ప్రసంగించిన కేంద్ర మంత్రి

## తుపాను బాధితులను ఆదుకుంటాం

- తుఫాన్ ప్రభావంపై అధికారులు అప్రమత్తంగా వుండాలి
- ప్రాణ నష్టం కలగడానికి వీల్లేదు
- వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సీఎం మాట్లాడుతూ ఇది వరి కోతల కాలం
- అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోంది
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్

మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో - మిగతా3లో



## ఆర్జేడీ-కాంగ్రెస్ @ 5-కే సర్కార్

- "ఆర్జేడీ-కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పొచ్చు
- కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్ (అవినీతి)..
- ఆయుధం ఉన్నచోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది
- ఆర్జేడీ అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు



## పాకిస్థాన్ వ్యోమగామిని గగనతలంలోకి తీసుకెళ్లనున్న చైనా

- చైనాకు చెందిన మానవ సహిత అంతరిక్ష కేంద్రం కీలక ప్రకటన
- పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యోమగాములకు శిక్షణ ఇవ్వనున్న చైనా
- ఒకరిని పెలోడ్ స్పెషలిస్ట్‌గా స్వల్పకాలిక అంతరిక్ష ప్రయాణ మిషన్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని వెల్లడి



## జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చలు..

- ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి చైనాకు ఊరట..!
- జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన
- దక్షిణ కొరియా వేదికగా సమావేశమైన ట్రంప్, జిన్‌పింగ్
- ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20 శాతం సుంకాలను 10 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ వెల్లడి
- జిన్‌పింగ్‌కు పదికి 12 మార్కులంటూ ప్రశంస

# ఆర్జేడీ-కాంగ్రెస్ @ 5-కే సర్కార్



ముజఫ్ఫర్‌పూర్: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోన్న వేళ ప్రచార వేడి పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ముజఫ్ఫర్‌పూర్‌లోని ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ–కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీలు ఎక్కడుంటే అక్కడ జంగిల్ రాజ్ వస్తుందని మోదీ దుయ్యబట్టారు.

"ఆర్జేడీ–కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పొచ్చు. కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్ (అవినీతి).. ఇవే ఆ పార్టీల పాలనా విధానాలు. ఆయుధం ఉన్నచోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది. ఆర్జేడీ అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు. వారి హయాంలో బిహార్‌లో 35వేల నుంచి 40వేల వరకు కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి" అని మోదీ మండిపడ్డారు.

**వారిది నూనె–నీటి బంధం..**

ఇక, మహాగఠ్‌బంధన్‌లో విభేదాల గురించి ప్రస్తావిస్తూ మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "ఆర్జేడీ–కాంగ్రెస్ పార్టీలది నూనె–నీటి లాంటి బంధం. ఆ రెండూ ఎప్పటికీ కలవవు. బిహార్‌లో వారు కలిసి చేస్తున్న ర్యాలీలన్నీ ఓట్ల కోసం చేస్తున్న బూటకపు చర్యలే" అని ప్రధాని ఎద్దేవా చేశారు. తనను విమర్శించడం అంటే.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తమ జన్మహక్కులా భావిస్తున్నారని అన్నారు.

**ఛఠ్ పూజను డ్రామా అన్నారు..**

ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఛఠ్ పూజను కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు అవమానించాయని మోదీ విమర్శించారు. ఓట్ల కోసం వారు ఎంతకైనా దిగజారుతారని మండిపడ్డారు. ఇలాంటి అవమానాన్ని బిహార్ తల్లులు ఎన్నటికీ మర్చిపోరని, అలాంటి వారిని క్షమించబోరని అన్నారు. ఇక, ఛఠ్ పూజకు యునెస్కో గుర్తింపు దక్కేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ ఈ సందర్భంగా తెలిపారు.

**బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీల అగ్రనేతల పర్యటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలలో రెండు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రచారాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ బీహార్‌లో బీజేపీ–ఎన్డీఏ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "బీహార్‌లోని నా కుటుంబ సభ్యులే ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం కోసం స్వయంగా బరిలోకి దిగారు. ఈ ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఉదయం 11 గంటలకు ముజఫర్‌పూర్‌లో, మధ్యాహ్నం 12:45 గంటలకు ఛప్రాలో ప్రజలతో సంభాషించే భాగ్యం నాకు కలుగుతుంది. రాష్ట్రంలోని నా సోదర సోదరీమణులు మరోసారి విజయ శంఖాన్ని పూరిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ముజఫర్‌పూర్‌లో జరిగిన మహాఘట్‌బంధన్ ఉమ్మడి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఆయనకు (మోదీకి) కేవలం మీ ఓటు మాత్రమే కావాలి. ఓట్ల కోసం డ్రామా చేయమంటే చేస్తారు. మీరేమైనా చేయించగలరు. నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమన్నా చేస్తారు" అంటూ రాహుల్ విమర్శించారు. "వారు మీ ఓట్లను దొంగిలించే పనిలో ఉన్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలను దొంగిలించారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే ప్రయత్నం చేస్తారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బుధవారం బేగుసరాయ్, సమస్తిపూర్, దర్భంగాలలో ఎన్డీఏ తరఫున ప్రచార ర్యాలీలు నిర్వహించారు. 2025 బీహార్ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య నెలకొంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ (రామ్ విలాస్) వంటి పార్టీలు ఉండగా, మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఉన్నాయి. వీటికి తోడు ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ కూడా రాష్ట్రంలోని 243 స్థానాల్లో పోటీ చేస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చలు



చైనా అధినేత జీ జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ను 10 శాతం మేర తగ్గిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరుదేశాల అధినేతలు దక్షిణ కొరియా వేదికగా సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, జీ జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయని అన్నారు. ఫెంటనిల్ తయారీలో ఉపయోగించే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని విశ్వసిస్తున్నానని అన్నారు. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20 శాతం సుంకాలను 10 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో అమెరికా సోయాబిన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైనట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని అన్నారు. ఏడాది పాటు ఎగుమతి చేసేలా ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు పదికి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం అంశంలో అమెరికాతో కలిసి పని చేసేందుకు చైనా అంగీకరించిందని అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని ట్రంప్ తెలిపారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా వస్తారని అన్నారు.

అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు.

**ఫెంటనిల్ టారిఫ్‌ల తగ్గింపు..**

"జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరింది" అని ట్రంప్ వెల్లడించారు.

**రేర్ ఎర్త్‌పై కుదిరిన డీల్..**

అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు.

**జిన్‌పింగ్‌కు 12/10..**

ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

**ఎయిర్‌పోర్టులోనే ఎందుకు..?**

జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు.

# కోటి రూపాయల డిజిటల్ అరెస్ట్ స్కాం

## ఆగిన రిటైర్డ్ ఆఫీసర్ గుండె



ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎంత అవగాహన కల్పించిన దేశంలో ఏదో ఒక మూల ఏదో ఒక మోసం నమోదవుతనూ ఉంది. తాజాగా ముంబై పోలీసులమని చెప్పి ఒక రిటైర్డ్ ఉద్యోగిని నిలువునా ముంచేశారు. జీవితంతం కష్టపడి సంపాదింఇ, పొదుపు చేసుకున్న సొమ్ము "డిజిటల్ అరెస్ట్" స్కాంలో పోవడంతో ఆయన గుండే ఆగిపోయింది. తీవ్ర విషాదాన్ని నింపిన ఈ స్కామ్ స్టోరీ ఎలా మొదలైంది అంటే.. పూణేకు చెందిన 82 ఏళ్ల రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారి, ఆయన 80 ఏళ్ల భార్యని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. ఆగస్టు 16న ముంబై పోలీసులం, "ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్" అంటూ వచ్చిన ఒక ఫోన్ కాల్ వారి జీవితాన్ని అతలా కుతలం చేసింది. ఆగస్టు 16–సెప్టెంబర్ 17 మధ్య సాగిన ఆ స్కాంలో విదేశాల్లో స్థిరపడిన ముగ్గురు కుమార్తెలు మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నారంటూ భార్య భర్తల్లిద్దరినీ మోసగాళ్లు బెదిరించారు. ఒక ప్రైవేట్ ఎయిర్‌లైన్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన బ్యాంక్ ఖాతా , ఆధార్ కార్డ్ లింక్ అయ్యి ఉన్నాయంటూ మూడు రోజుల పాటు వారిని కదలకుండా, మెదలకుండా డిజిటల్ అరెస్ట్" చేసిన భయభ్రాంతులకు గురి చేశారు. ఫోన్ కెమెరాను స్విచ్ ఆన్‌లో ఉంచమని ఆదేశించారు. ఆ తరువాత సీబీఐ ఢిల్లీ ఆఫీసునుంచి %ఖూా% అధికారిణిగా చెప్పుకుంటూ మరొకాల్ వచ్చింది. మనీలాండరింగ్ కేసులో చిక్కుకున్నారు కాబట్టి మిమ్మల్ని 'హోమ్ అరెస్ట్' లేదా 'జైలు అరెస్ట్'లో ఉంచుతామని చెప్పారు. అలా వారికి సంబంధించిన అన్ని బ్యాంక్ , ఆధార్ వివరాలను సేకరించి, ఐదు వేర్వేరు బ్యాంకు ఖాతాలకు డబ్బును బదిలీ చేయమని బలవంతం చేశారు. అలా ఈ దంపతుల పొదుపు మొత్తాన్ని, వారి కుమార్తెలు విదేశాల నుండి పంపిన డబ్బులు కలిపి మొత్తం రూ. 1.19 కోట్లు కొట్టేశారు. ఇక అప్పటినుంచి కాల్స్ అకస్మాత్తుగా ఆగిపోవడంతో మోసపోయామని గ్రహించి, వారి కుమార్తెలలో ఒకరిని సంప్రదించారు, వారు నేరాన్ని పోలీసులకు నివేదించమని కోరడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పూణే సైబర్ పోలీసులకు చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ అందించిన వివరాల ప్రకారం "డిజిటల్ అరెస్ట్" స్కామ్‌లో తాము మోసపోయామని గ్రహించిన సదరు అధికారి అక్టోబర్ 22న ఆ షాక్‌లో, ఇంట్లో కుప్పకూలి పోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. దీనిపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జీవితాంతం పొదుపు చేసిన డబ్బును పోగొట్టుకోడం, స్కామర్ల వేధింపుల కారణంగా తన భర్త తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడని , అదే ఆయన ప్రాణాలు తీసిందని వాపోయింది.

**సైబర్ క్రైమ్ నిపుణులు హెచ్చరికలు**


ఫోన్ కాల్ ద్వారా ఎవరినీ "అరెస్టు" అనేది జరగదనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి అంటున్నారు సైబర్ క్రైమ్ పరిశోధకులు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎపుడూ ఎవరికీ, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు షేర్ చేయవద్దని, ఈ వివరాలు లేదా డబ్బును డిమాండ్ చేసే హక్కు ఏ అధికారికీ లేదని స్పష్టం చేశారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్‌పట్ల భయపడకుండా, అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. మోసగాళ్ళు చిన్న నగరాల నుండి సిమ్ కార్డులు, %వూచీ% నెట్‌వర్క్‌లను ఉపయోగించి తమ గుర్తింపును దాచిపెడుతున్నారన్నారు.

## పాకిస్థాన్ వ్యోమగామిని గగనతలంలోకి తీసుకెళ్లనున్న చైనా



పాకిస్థాన్ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపేందుకు చైనా సన్నద్ధమవుతోంది. ఈ మేరకు చైనా మానవ సహిత అంతరిక్ష కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ దేశ వ్యోమగాములతో కలిసి పాకిస్థాన్ వ్యోమగామిని అంతరిక్షంలోకి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యోమగాములకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. పాకిస్థాన్ అంతరిక్ష కేంద్రం ఎంపిక చేసిన ఇద్దరు వ్యోమగాములు చైనా వ్యోమగాములతో కలిసి శిక్షణ తీసుకుంటారని ప్రతినిధి జాంగ్ జింగ్బో తెలిపారు. వారిలో ఒకరిని పెలోడ్ స్పెషలిస్ట్‌గా స్వల్పకాలిక అంతరిక్ష ప్రయాణ మిషన్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆ మిషన్ సమయంలో పాక్ వ్యోమగామి శాస్త్రీయ ప్రయోగాలతో పాటు సాంకేతిక ప్రదర్శనలకు సంబంధించి చైనా వ్యోమగాములకు సహాయం అందిస్తారని ఆయన వివరించారు. 2030 నాటికి చంద్రుడిపైకి తమ వ్యోమగామిని దింపేందుకు సిద్ధంగా ఉన్నామని జింగ్బో పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వ్యోమగాముల బృందాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

## రూటు మార్చారని బీమా నిలపకూడదు.. సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



**ఇంటర్నెట్ డెస్క్:** పరిహారం చెల్లింపు విషయంలో బీమా కంపెనీలకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రూట్ పర్మిట్ ఉల్లంఘన వంటి సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని పేర్కొంది. ఓ ప్రమాదంలో బాధితుడి తప్పిదం లేదని.. అలాంటప్పుడు అతడికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అంతేకాదు సంబంధిత పరిహారాన్ని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకోవచ్చని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సమర్థనీయమని పేర్కొంది. కర్ణాటకలో అక్టోబర్ 7, 2014లో వేగంగా వచ్చిన ఓ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి స్పాట్‌లోనే చనిపోయాడు. ఈ కేసులో బాధితుడికి వడ్డీతో కలిపి రూ. 18.86లక్షల పరిహారం ఇవ్వాలని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ పరిహారం సరిగ్గా లెక్కించలేదని పిటిషనర్, మరోవైపు ప్రమాదానికి కారణమైన వాహనం రూట్ పర్మిట్‌ను ఉల్లంఘించిందని బీమా కంపెనీ ఆరోపిస్తూ అక్కడి హైకోర్టును ఆశ్రయించాయి. విచారించిన హైకోర్టు బాధితుడికి పరిహారం చెల్లించాల్సిందేనని బీమా సంస్థకు స్పష్టం చేసింది. అయితే, దానిని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకునేందుకు అనుమతిచ్చింది. దీనిని సవాలు చేస్తూ బీమా సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. మరోవైపు రికవరీకి వీలు కల్పించడాన్ని సవాలు చేస్తూ వాహన యాజమాని కూడా సుప్రీంకు వెళ్లారు. విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ రెండు అప్పీళ్లను తోసిపుచ్చింది. సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని, అది సహజ న్యాయ భావనకు విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో బాధితుడికి పరిహారం చెల్లించాలని, దాన్ని యజమాని నుంచి రికవరీ చేసుకోవడం సమర్థనీయమేనని పేర్కొంది.

## శబరిమల అయ్యప్ప దర్శనం.. నవంబర్ 1 నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం



**పాతనంతిట్ట:** శబరిమల అయ్యప్పస్వామి దర్శనాలకు చెందిన ఆన్‌లైన్ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానున్నది. ఈ ఏడాది కూడా భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం రానున్నారు. మండల పూజ సీజన్ నవంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. డిసెంబర్ 27వ తేదీన ఆ సీజన్ ముగియనున్నది. అయితే దీని కోసం ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అయ్యప్ప స్వామి దర్శనం కోసం వర్చువల్ క్యూ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు బోర్డు చెప్పింది. ప్రతి రోజు 70 వేల మంది భక్తులకు క్యూలైన్ టికెట్లను అమ్మనున్నారు. ఇక స్పాట్ బుకింగ్ కోసం 20 వేల టికెట్లను కేటాయించారు. మండల సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించింది. పంబ వద్ద భారీ పందిరిని నిర్మించనున్నారు. ఒకేసారి పది వేల మంది భక్తులు సేద తీరే తరహాలో ఆ పందిరి నిర్మాణం ఉంటుంది. భక్తుల తాకిడిని తట్టుకునేందుకు సుమారు 50 లక్షల అరవణం ప్రసాదం బాటిళ్లు కూడా సిద్ధం చేస్తున్నారు. రెండు నెలల పూజల కోసం నవంబర్ 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు శబరిమల ఆలయాన్ని తెరవనున్నారు. డిసెంబర్ 27వ తేదీన మూసివేసి మళ్లీ డిసెంబర్ 30వ తేదీన మకర పూజల కోసం ఆలయాన్ని ఓపెన్ చేస్తారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 14వ తేదీ వరకు మకర మహోత్సవం ఉంటుంది. జనవరి 20వ తేదీన ఆ పూజలను ముగిస్తారు.

# కాలం చెల్లిపోతున్న కాంగ్రెస్ గ్యారంటీలు

-మొదటిపేజీ తరువాయి


చేస్తున్నారు. ప్రశ్నలు సంధిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ‘ గ్యారంటీలు’ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. 025 అక్టోబర్ నాటికి, ఈ హామీల్లో కీలకమైనవి అమలు కావడం లేదు. బడ్జెట్ 2025-26లో రూ.56,084 కోట్లు ఈ గ్యారంటీలకు కేటాయించినప్పటికీ, పూర్తి అమలు లేకపోవడంపై ఃఖీా, ఃఏఖలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. కాంగ్రెస్ మేనిఫెస్టో ‘అభయ హస్తం’లో ప్రకటించిన గ్యారంటీల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం ఉన్నాయి. ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. కానీ లబ్దిదారులు ఎంత మంది ఉన్నారో ఇప్పటి వరకూ ప్రకటించలేదు. రూ. 2 లక్షల రుణమాఫీకి రూ.20,617 కోట్లు ఖర్చు చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. మహిళలకు ఖీఅ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల సహాయం చాలా కొద్ది మందికి ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 నెలవారీ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ పథకం అమలు గురించి ఆలోచిండం లేదు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డు (రూ.5 లక్షలు), ఉద్యోగ శిక్షణకు రూ.4,000 స్టైపెండ్ అమలు కాలేదు చేయూత పథకం కింద సామాజిక పెన్షన్లు పేదలకు రూ.4,000 ఇస్తామని హామీ ఇచ్చారు. సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, రైతు సంక్షేమం, మహిళలు, యువత వంటి విభాగాల్లో చాలా హామీలు మేనిఫెస్టోలో ‘బంగారు తెలంగాణ’కు సంబంధించి, ముఖ్యంగా మహిళలు, పెళ్లి, బంగారం సహాయం వంటి ‘బంగారుతల్లి ‘ వంటి



స్కీమ్‌లు ఉన్నాయి. పేద కుటుంబాల్లో కలిగిన బాలికలకు పెళ్లికి 10ఠ బంగారం + రూ.1 లక్ష సహాయం ఇస్తామన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద ూఅ/ూ కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పారు. రెండేళు అవుతున్నా.. ఇప్పటికీ అమలు చేయడం లేదు. గ్యారంటీలతో పాటు ఇంకా చాలా హామీలు ఇచ్చారు. కళ్యాణమస్తు కింద .. తులం బంగారం ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు.కానీ ఇవ్వడం లేదు. పేదలు ఎదురు చూసే అత్యంత ముఖ్యమైన పథకం.. పెన్షన్లు. ఏపీలో పెన్షన్లు పెంచడంతో తమకూ పెంచుతారని చాలా మంది ఎదురు చూస్తున్నారు. మహిళలకు ఇస్తామన్న రెండున్నర వేలు.. అలాగే ఆటోడ్రైవర్లకు సాయం వంటివి నేరుగా పేదలకు లింక్ అయి ఉన్నాయి. ఇతర పథకాల విషయంలో ఏమో కానీ వీటి అమలు కోసం.. వారు ఎదురు చూస్తున్నారు. రెండేళ్ల పాలన విజయవంతం అయిందని సంబరాలు చేయాలని రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారు. కానీ ఇలాంటి కీలక పథకాల అమలు విషయం ఈ సంబరాల్లో కచ్చితంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

# గరం...గరంగా పాలకుర్తి పాలిటిక్స్

**వరంగల్ :** ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీరెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి. పాలకుర్తి నియోజకవర్గంలో పాలిటిక్స్ గరం గరంగా నడుస్తున్నాయి. అధికార? ప్రతిపక్ష పార్టీల మధ్య జరగాల్సిన పోటాపోటీ రాజకీయాలు స్వంత పార్టీలోనే జరుగుతున్నాయి. అధికార హస్తం పార్టీ నేతలు రెండుగా చీలిపోయి ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారు. దీంతో నియోజకవర్గ అభివృద్ధి మాట పట్టించుకునేవారు లేరని స్థానికులు అసంతృప్తికి లోనవుతున్నారు. ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీ రెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి ప్రజలు సంక్షేమం, అభివృద్ధిలో నియోజకవర్గం దూసుకుపోతుందని భావించారు. ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డిలు రాజకీయాలకు కొత్త కావడంతో?. పార్టీలను పక్కనబెట్టి డెవలప్‌మెంట్ పైనే దృష్టి పెడతారని ఆశపడ్డారు. అయితే ఇప్పుడు తమ పరిస్థితి పెనం నుండి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన చెందుతున్నారు. సొంత నిధులు ఖర్చు పెట్టైనా అభివృద్ధి చేస్తామని హామీలు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఆమె అత్త ఝాన్సీ రెడ్డి నియోజకవర్గాన్ని మోడల్ గా నిలుపుతామని ప్రజలకు ప్రామిస్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులను సొంత నిధులు ఖర్చు పెట్టైనా పూర్తి చేస్తామని హామీల వర్షం గుప్పించారు. కానీ నెల గడుస్తున్న కొద్దీ?మాటలు తప్ప, అభివృద్ధి జాడలు కనిపించట్లేదు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగట్లేదని స్వంత పార్టీ నేతలే తమ ఎమ్మెల్యేపై మండిపడుతున్నారు. కొంతమంది నేతలు ధైర్యం చేసి ప్రజలకిచ్చిన హామీల మాటేమిటని అడిగితే?.పార్టీ నుండి వెలివేసి..మాతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ సినిమా డైలాగులు చెప్తున్నారట. గోదాంల నిర్మాణాలపై కాంగ్రెస్ నాయకుడు ఫైర్. ప్రస్తుతం దేవరుప్పుల మండలంలో కోట్ల రూపాయల నిధులతో గోదాంల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. అయితే ప్రభుత్వ స్థలంలో అందరికీ అందుబాటులో ఉండే చోట నిర్మాణాలు చేయాలని సొంత పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దేవరుప్పుల శివారులోని మనుపాడ్ గుట్టలను తొలగించి గోదాంల నిర్మాణం చేయాలని కొందరు నేతలు సూచిస్తున్నారు. అయితే పర్యావరణానికి హాని జరిగేలా?గుట్టలను తొలగిస్తే ఊరుకోబోమని కాంగ్రెస్



నాయకుడు పెద్ది కృష్ణమూర్తి ఫైర్ అయ్యారు. దీంతో ఆగ్రహానికి లోనైన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మరో సినిమా డైలాగ్ అందుకున్నారట. గ్రామస్తుల నిర్ణయం చెప్తే?ఈ డైలాగులు ఏంటని కాంగ్రెస్ శ్రేణులే విస్తుపోయారట. ప్రజల సంక్షేమం కోసం మాట్లాడితే వార్నింగ్ ఇస్తున్న అత్త ఝాన్సీ. గత కొద్ది నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని నిరసనలు జరుగుతున్నాయి. ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలని కొంతమంది హస్తం పార్టీ నేతలే పట్టుబడుతున్నారట. ఇలా ప్రజల సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడితే?.తమతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ తమ చుట్టూ ఉన్న నేతలకే వార్నింగ్స్ ఇస్తున్నారట ఎమ్మెల్యే అత్త ఝాన్సీ రెడ్డి. అభివృద్ధిని పట్టించు కోవడం లేదని స్థానికుల అసంతృప్తి. నియోజకవర్గంలోని గ్రామాలలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారట. ఇక ఖమ్మం హైవే ప్రతిరోజూ ప్రమాదాలతో రక్తసిక్తంగా మారుతోంది. సమస్యలు చెప్పుకుంటే మళ్ళీ సినిమా డైలాగులు చెప్తారేమోనని సైలెంట్ గా బాధలు అనుభవిస్తున్నారట నియోజకవర్గ ప్రజలు. రాజకీయాలకు అతీతంగా తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎర్రబెల్లిని ఓడిస్తే? అభివృద్ధి సంక్షేమం దేవుడెరుగు సమస్యలు చెప్పుకుంటే రీసౌండ్ లో డైలాగులు వినాల్సి వస్తుందని లోలోపలే మదన పడుతున్నారట పాలకుర్తి ప్రజలు. అభివృద్ధిలో దూసుకెళ్తామనుకున్న ఆశలన్నీ అడియాసలైనట్లేనని తలలు పట్టుకుంటున్నారట నాయకులు.

# ఎంజీఎంలో ఏం జరుగుతోంది

**వరంగల్ :** వైద్యులను ప్రాణదాతలు అని పిలుస్తుంటారు. కనిపించే దేవుళ్ళుగా రోగులు కొలుస్తుంటారు. అటువంటి గొప్ప పేరు ఉన్న వైద్యులు రోగులకు చికిత్స అందించి.. ఇంకా మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉండగా.. చికిత్సను పక్కనపెట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. అధ్వగోలు వ్యవహారాలకు పాల్పడి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో అతిపెద్దదైన ఎంజీఎం లో అవినీతి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల ఈ ఆసుపత్రిలో ఒకటే ఆక్సిజన్ సిలిండర్ ను ఇద్దరు చిన్నారులకు పెట్టడం చర్చకు దారి తీసింది. దీనిపై మీడియాలో ప్రముఖంగా వార్తలు రావడంతో వైద్య శాఖ మంత్రి ఎంజీఎం పై చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే అందులో నిజం లేదని తర్వాత తేలింది.. ఇటీవల ఎంజీఎం లో రోగులపై సెక్యూరిటీ గార్డ్ లు దాడి చేశారు. ఆ దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా మీడియాలో విపరీతంగా కనిపించాయి. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం.. మీడియాలో ప్రముఖంగా రావడంతో ఎంజీఎం సూపరిండెంటెంట్ పై చర్యలు తీసుకున్నది.ఈ సంఘటన తర్వాత ఎంజీఎం లో ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎంజీఎం లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రెండు కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా కావడంతోపాటు బెండర్లు వేయకుండానే స్టేషనరీ కొనుగోలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ఆస్పత్రి వర్గాలలో చర్చకు దారితీస్తోంది. ఎంజీఎం లో పనిచేస్తున్న




ఉన్నతాధికారుల్లో ఒకరు ఈ అవినీతి వ్యవహారాన్ని మీడియాకు లీక్ చేసినట్టు తెలుస్తోంది. ఓ వర్గం ఎంజీఎంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తోందని.. పై అండలు చూసుకుని అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని మరో వర్గం ఆరోపిస్తోంది. మరో వర్గానికి చెందిన ఉన్నతాధికారి మీడియాకు లింకులు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపడితే నిజాలు బయటపడతాయని తెలుస్తోంది. ఎంజీఎం కొత్త బాస్ దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని రోగులు అంటున్నారు.ఇటీవల కాలంలో సెక్యూరిటీ గార్డులు కూడా రోగులపై దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు పై అండదండలు తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలున్నాయి.. కొత్త బాస్ సెక్యూరిటీ గార్డుల వ్యవహారశైలి పట్ల దృష్టి సారించాలని.. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు. వైద్య సేవల విషయంలో పారదర్శకతను పెంపొందించాలని కోరుతున్నారు.

## దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు వెన్నెముక ఎన్‌డిఆర్ ఎఫ్!



**హైదరాబాద్ :** దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు ఎన్‌డిఆర్‌ఎఫ్ వెన్నెముక వంటిదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అటవీ అగ్నిప్రమాద దాలు, పర్వత రక్షణ చర్యలు, సీబీఆర్ఎన్ వంటి కొత్త రకాల విపత్తులను ఎదుర్కొని దానికి ఎన్డీఆర్ఎఫ్ సిద్ధమైందని చెప్పారు. విపత్తు గురైన ప్రజలను కాపాడేందుకు ప్రాణాలు కోల్పోయిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది త్యాగాలు దేశం ఎన్నటికీ మరువదన్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ధైర్యం, అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తి అని కొనియాడారు. ఈరోజు న్యూఢిల్లీలో న్యూఢిల్లీలో ఎన్‌డిఆర్‌ఎఫ్ అమరవీరుల సంస్మరణ సభకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. సంస్థ మెంబర్ సెక్రటరీ రాజేంద్ర సింగ్, సభ్యులు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అటా హస్నేన్ , డీజీ పీయూష్ ఆనంద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారితో కలిసి ఫోటో దిగారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. అందులోని ముఖ్యాంశాలు:దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎన్డీఆర్ఎఫ్ అమరవీరులకు ఘన నివాళి అర్పించడం ద్వారా వారి సేవలను, త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన సమయమిది. ఈ స్మారక చిహ్నం కేవలం రాతి నిర్మాణం కాదు, మన ఎన్డీఆర్ఎఫ్ సైనిక దళాలు, రాష్ట్ర పోలీస్ బలగాల వీరత్వం, నిబద్ధత, అచంచల కర్తవ్య భావానికి ప్రతీక. ఈ రోజు దేశ సేవలో తమ వారిని కోల్పోయిన కుటుంబాల మధ్య ఉండటం నాకు గర్వం మరియు గౌరవంగా ఉంది. నేను మీ అందరికీ వందనాలు తెలియజేస్తూ, దేశం ఎల్లప్పుడూ వారి త్యాగాన్ని స్మరించుకుంటుందని, వారి ధైర్యం మరియు అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని హామీ ఇస్తున్నా.మన పోలీస్ బలగాలు, అందులో అర్ధసైనిక దళాలు మరియు రాష్ట్ర పోలీస్ దళాలు, దేశ భద్రత మరియు శాంతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వారి ధైర్యం మరియు త్యాగం వల్లే మనం సరిహద్దులను రక్షించగలుగుతున్నాము, అంతర్గత భద్రతను కాపాడగలుగుతున్నాము, ఉగ్రవాదం, నక్సలిజం వంటి ప్రమాదాలను ఎదుర్కొనగలుగుతున్నాము. ఎన్‌డిఆర్‌ఎఫ్ మన దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు వెన్నెముక వంటిది. ఈ ఎన్డీఆర్ఎఫ్ చూపుతున్న క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, త్యాగభావం ప్రపంచస్థాయి ప్రశంసనీయమైనది. ఏ విపత్తు వచ్చినా, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు సిద్ధంగా ఉండటం గొప్ప విషయం.

## తుపాను బాధితులను ఆదుకుంటాం..



-మొదటిపేజీ తరువాయి

ఉంటున్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. తెలంగాణలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ ఇది వరి కోతల కాలం. అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలి. రోడ్లపై బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వే ల వద్ద, దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలి. ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలి. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి. వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలి. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలి. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలపాలి. వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి. ప్రాజెక్టుల ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి . ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని అన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు..

## అలంకార్ జంక్షన్‌లో రాకపోకలకు అంతరాయం

**హనుమకొండ :**




హనుమకొండ నగరాన్ని వరద ముంచెత్తింది. మొంథా తుఫాన్ ప్రభావంతో నగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బుధవారం రోజంతా కురిసిన వర్షానికి రోడ్ల నీళ్ల వరదలా ప్రవహించాయి. హనుమకొండలోని అలంకార్ బ్రిడ్జి, కేయూ బైపాస్ రోడ్ పెద్దమ్మగడ్డ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అటువైపు రాకపోకలను నిలిపివేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. హనుమకొండ చౌరస్తా మీదుగా వరంగల్‌కు అంతరాయం ఏర్పడింది. అలంకార్ జంక్షన్, ములుగురోడ్, అజారా హాస్పిటల్‌కు వెళ్లేందుకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వరద ఉధృతంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రయాణికులు తెలియక అటువైపు రావడంతో ఎటువెళ్లాలో తెలియక అయోమయానికి గురయ్యారు. యాదవనగర్ మూలమలుపు వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. 4వ డివిజన్‌లోని జ్యోతిబసు నగర్‌కాలనీ, పెద్దమ్మగడ్డ కాలనీలు, అలంకార్ జంక్షన్‌లోని పలు కాలనీలు నీటమునిగాయి. పోలీసులు, ఫైర్‌సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. వరంగల్‌కు కాపువాడ మీదుగా వాహనాలను తరలించారు.

# సంపాదకీయం

## నీటి సంక్షోభానికి ప్రత్యామ్నాయ మార్గాలు

ప్రపంచంలో మంచినీటి కొరత నానాటికీ తీవ్రమవుతున్నది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మంచినీటి లభ్యతను పెంచడం ఎలా అన్నది ప్రస్తుతం ప్రభుత్వాలు, విధానకర్తల ముందున్న ప్రధాన సమస్య. 95 శాతం ఉన్న ఉప్పునీటి సముద్ర జలాలను మంచినీటిగా మార్చే అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా మంచినీరు, ఆహార కొరతను తీర్చవచ్చని శాస్త్రజ్ఞులు అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా లభించే జలాలతో 97.43 శాతం ఉప్పునీరు కాగా, మంచినీటి లభ్యత కేవలం 2.57 శాతం మాత్రమేనని గణాంకాలు ఘోషిస్తున్నాయి. ఈ స్వచ్ఛజలాలలో నదుల ద్వా రా లభించేది కేవలం 0.0002 శాతం మాత్రమే. ఈ పరిమిత నీటితోనే విశ్వవ్యాప్తంగా మానవులు, జంతువుల ఆకలిదప్పులు, పంటల సాగు అవసరాలు తీర్చవలసి వస్తోంది. అయితే ప్రస్తుతం 800 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా 2050 నాటికి 1000 కోట్లు దాటుతుంది. పరిమితంగా ఉన్న మంచినీటి లభ్యతను పెంచకపోతే భవిష్యత్తులో జీవావళి తీవ్ర నీటికొరతను ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులవల్ల దుర్భిక్షాలు, కరవులు ఏర్పడి నీటిలభ్యత తగ్గడం, దశాబ్దాల క్రితం నిర్మించిన భారీ జలాశయాలు ఒండ్రు మట్టి చేరడంవల్ల పూడికపెరిగి నిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టు చివరి ప్రాంతాలకు నీరు చేరకపోవడం తెలిసిందే. భారీవర్షాలు, వరదలు వచ్చినపుడు నీరు నిల్వ చేసుకోలేని దుస్థితి వల్ల ఏటా వేల టిఎంసిలు వృథాగా ఉప్పు సముద్రాలలో కలసి పోవడం, అయినా రాష్ట్రాల మధ్య జలజగడాలు ఎడతెగకుండా కొనసాగడం, ఒక ప్రధాన ప్రాచీన పార్టీ నేతలు వాస్తవాలను గమనించకుండా 90% వాటా నీరు తమకే కావాలని కోరుతూ జాతీయ సమైక్యతకు చేటు తెస్తూ ఉండటం చూస్తున్నాం. నీటి సంక్షోభం ముంచుకొస్తున్నా ప్రత్యామ్నాయ మంచినీటి వనరుల కోసం జరుగుతున్న ప్రయత్నాలు ఏమంత ఆశాజనకంగా లేవు. రానున్న కాలంలో ఆహారం, మంచినీటి అవసరాలు మరింత పెరుగుతాయి. నీటికొరత ఉన్న ప్రాంతాలలో సేద్యానికి, మంచినీటికోసం అధికాధికంగా తోడటం వల్ల పెక్కు చోట్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. లభ్యమయ్యే ఉపరితల నదీ జలాల కోసం వివిధ ప్రాంతాల మధ్య ఎడతెగని వివాదాలు, వైషమ్యాలను పెంచుతున్నాయి. ప్రపంచ జనాభాలో ఇప్పటికే సగం మంది నీటికొరతను ఎదుర్కొంటున్నట్లు యునిసెఫ్ పేర్కొన్నది. భారత్‌లో 60 కోట్లమంది (జనాభాలో 45%) నీటి కొరతను ఎదుర్కొంటున్నట్లు కేంద్ర విధాన నిర్ణాయక మండలి నీతిఆయోగ్ వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో నీటి అవసరాలు రెండింతలు పెరగనుండటం, మరోవైపు జలాశయాలలో పూడికపెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గి నీటికి కటకట ఏర్పడింది. ఉప్పునీటిలో లీటరుకు టిడిఎస్ స్థాయిలు వెయ్యి మి.గ్రా కంటే ఎక్కువగా ఉండటం వల్ల అవి తాగడానికి, సేద్యానికి, పారిశ్రామిక వినియోగానికి పనికి రావనే అభిప్రాయం ఉంది. అందువల్ల అన్ని అవసరాలకు మంచినీటినే వాడటం వల్ల గిరాకీ కంటే నీటి లభ్యత తక్కువగా ఉండటంవల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. నీటిసంక్షోభం తీవ్రమవుతున్నా నీటి పొదుపు, పరిమితంగా ఉన్న మంచినీటి పునఃపంపిణీ గురించే మాట్లాడుతున్నారే గానీ ప్రత్యామ్నాయాల గురించి పట్టించుకోవడం లేదు. ఉప్పునీటి నుండి క్షారాన్ని యోలగించి మంచినీటిగా మార్చడం, సేద్యానికి ఎలా వాడాలి అనే దానిపైనే పరిశోధనలు సాగుతున్నాయి. వాస్తవ మేమంటే ప్రపంచ నీటిలో 98% ఉప్పునీరే. అందువల్ల అత్యాధునిక శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను వినియోగించి పెరుగుతున్న మానవాళి అవసరాలు తీర్చే రీతిలో ప్రపంచ దేశాలు క్షార జలాలను ఎలా మార్చాలి అనే ప్రధానాంశంగా పరిశోధనలు సాగిస్తే అది ఎంతో మేలు. రక్షణ బడ్జెట్లు, ఆయుధ పోటీలు పెంచి, లాభాలు దండుకుంటున్న సంపన్న దేశాలు మానవాళికి అత్యవసరమైన మంచినీటిపై దృష్టి సారించకపోవడం తగదు. భారీ జలాశయాలలో నీటినిల్వ, నీటి ఆదాకు మాత్రమే పరిష్కారాలను పరిమితం చేశారు. ఉప్పునీటిని శుద్ధి చేసి ఆహారోత్పత్తికి, మంచినీటి సరఫరా మెరుగుకు నిర్దిష్ట ప్రయత్నాలు లేవు. ఉప్పునీరు వాడకానికి పనికి రావనే నమ్మకాలు బలంగా ఉన్నా యుగయుగాలుగా మానవాళి ఆక్షార జలాలను వాడటం తెలిసిందే. 1900 పోషకాలతో లభించే సముద్ర ఉత్పత్తులు మానవ ఆహారంలో ప్రధాన భాగం. మన సాగరాలు, మహాసముద్రాలు ఎన్నో ఖాద్య యోగ్యమైన మొక్కలకు నెలవులు. వివిధ వర్ణాల, రకాల నాచు, ఆలగే గవ్వలరకాలు, తూర్పు, ఆగ్నేయాసియా, పసిఫిక్ తీరదేశాల్లో ఎక్కువగా వాడే సముద్ర ద్రాక్ష తదితర మొక్కలు ఆహారంగా ఎంతో ఉపయోగమవుతున్నాయి. ఆర్థిక దృక్కోణం నుండి చూస్తే మంచినీటితో సాగయ్యే ఎన్నో పంటలను కొన్ని ప్రక్రియలతో ఉప్పునీటితో సాగు చేసే వీలుం ఉంటుందని అంటున్నారు. క్షారాన్నీ తట్టుకుని పెరిగే తుమ్మ, జమ్మి తదితర సముద్ర మాన్లు మేలి కలపగా పనికొస్తాయని చెబుతున్నారు. హాలో ఫైట్స్ ప్రత్యామ్నాయంగా వస్తున్న పంటలు వంట నూనెల ఉత్పత్తికి, మొక్కజొన్న, చెరకు, పామాయిల్‌కు ప్రత్యామ్నాయంగా అక్కరకొస్తాయంటున్నారు. ఉప్పునీటితో పెరిగే పూవులు, ఉద్యాన పంటలు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడతాయని నిపుణుల అభిప్రాయం. క్షారాజలాన్ని మెరుగైనరీతిలో వాడితే పురోభివృద్ధి సాధ్యం కాగలదని భావన బలంగా ఉంది. ప్రపంచ జనాభాలో 38% మంది సముద్ర తీరానికి 100 కి.మీ దూరంలోనే నివసిస్తున్నందున (అంటార్కిటికా మినహా) తీరప్రాంతం 24 లక్షల కి.మీ మీరు ఉంటుంది. వాతావరణ పెనుమార్పు వల్ల సముద్రాలు చొచ్చుకువచ్చి తీర ప్రాంతాలను కలిపేసుకుంటున్నాయి. భారత ద్వీపకల్పం 11 వేల కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్ 972 కి.మీ సాగరతీరాన్ని కలిగి, లక్షలాది మంది కడలి పుత్రులకు జీవనోపాధి కల్పిస్తున్నాయి. వారికి మరింత మెరు గయిన జీవనోపాధుల కల్పనకు సాగరతీరాన్ని, జలాలను ఆహారోత్పత్తి, పంటల సాగు, తాగునీటి అవసరాలు తీర్చడానికి ఎలాంటి చర్యలు అవసరమో నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సత్వర చర్యలు చేపట్టాలి. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా కేంద్రాల శీతలీకరణకు రోజుకు కోటి 90 లక్షల లీటర్ల నీరు అవసరమని, సాగర జలాలను శుద్ధి చేసి వాడతారని చెబుతున్నారు. ఈ ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సిఎం చంద్రబాబు, ఐటి మంత్రి లోకేష్ చెబుతున్నారు. సాగర జలాలను మెరుగైన రీతిలో వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడానికి మోడీ ప్రభుత్వ సహకారంతో ముందడుగు వేయాలి.

# టెట్ అర్హత సాధిస్తేనే.. ఉపాధ్యాయులా?



భారతదేశంలోని 6 నుండి 14 సంవత్సరాలు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడమే లక్ష్యంగా ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం- 2009 ఆగస్టు 4న రూపొందించింది భారత పార్లమెంటు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ లో ఉంది. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చింది. దీంతో విద్యను ప్రతి విద్యార్థికి ప్రాథమిక హక్కు గా అందించే 135 దేశాలలో భారతదేశం ఒకటిగా మారింది. ఈ చట్టంలో భాగంగానే 2011లో కేంద్రం టెట్‌ను ప్రవేశ పెట్టింది. ఇప్పుడు ఈ పరీక్షే ఉపాధ్యాయులకు గుదిబండగా మారింది. ఈ చట్టం ప్రకారం టీచర్‌గా పని చేయాలంటే టెట్ కూడా క్వాలిఫై అవ్వాలని చట్టం చేశారు. ఇక అప్పటినుండి బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన వారందరూ టెట్ రాస్తున్నారు. మరి ఇప్పుడెందుకు టెట్ గోల? అంటే సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు ప్రకారం, ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరి చేస్తూ.. అలాగే సర్వీస్‌తో సంబంధం లేకుండా ప్రమోషన్ పొందాలంటే.. టెట్ పాస్ అవడం తప్పనిసరి చేస్తూ తీర్పునివ్వడంతో ఉపాధ్యాయుల్లో టెన్షన్ నెలకొంది. సుప్రీం తీర్పు ప్రకారం, ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణులు కావాలని లేదా తప్పనిసరి పదవీ విరమణ ఎదుర్కోవాలని షరతు పెట్టింది. ఆ మేరకు రాష్ట్రాలు ఇప్పుడు ఈ విధానాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుం టున్నాయి. దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో నాలు గు రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్లు వేసి పోరాడుతుంటే 'ఊరంతా ఒకదారైతే ఉలిపి కట్టెదొక దారన్నట్లు' ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ఆరడుగులు ముందుకేసి ఇందుకు నోటిఫి కేషన్‌ను విడుదల చేశాయి.. ఈ ప్రభుత్వాలకు ఇంత ఉత్సాహం ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలులో, 32 వేల బకాయిల చెల్లింపులో, పీఆర్సీ కమిటీ నియామకంలో, ఖాళీగా ఉన్న పోస్టుల్లో మరో డీఎస్సీ వేయడం వంటి సమస్యల పరిష్కారంలో ఎందుకు చూపలేక పోతున్నారు? దున్నపోతు ఈనిందంటే గాట్లో కట్టేసే ధృతరాష్ట్ర సంస్కృతి అమలుకు ఉత్సాహమెందుకు? ఊపిరి సలపని విధులతో అల్లాడుతున్న ఉపాధ్యాయ వర్గంపై ఒత్తిడి పెంచడం అవసరమా?

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ పాస్ కాకపోతే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఉద్యోగం నుండి తొలగించాలి. అయితే ఇలా ఎంత మందిని తొలగిస్తారు? పాతిక, ముప్పై సంవత్సరాల సర్వీస్ కలిగిన వేలాది మంది గురువులకు ఇంతటి అగ్ని పరీక్షలు అవసరమా? విద్యా చట్టం ప్రకారం ఎస్ఈఆర్టీలోని అన్ని ప్రతిపాదనలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు అమలు చేశాయా? ప్రైవేట్ విద్యాసంస్థలు 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాయా? ముందుగా ప్రభుత్వా లు టెట్‌కు అర్హత సాధిస్తేనే పరిపూర్ణమైన ఉపాధ్యాయులనే ఛాందస భావన నుండి బయటకు రావాలి. కాదు అదే సమంజసమని పాలకులు భావిస్తే.. ఇప్పటివరకు ఆయా ఉపాధ్యాయుల వద్ద విద్యను అభ్యసించిన లక్షలాది పౌరులు, వివిధ ఉద్యోగాలు చేస్తున్న వారికీ ఆయా స్థాయిల్లో పరీక్షలు అవసరమే కదా! ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల పరిస్థితి కూడా ఇదే! ఉపాధ్యాయ వర్గాన్ని త్రిశంకు స్వర్గంలోకి నెట్టే ఈ దుందుడుకు అపరిపక్వ విధానాలకు స్వస్తి పలకక పోతే వ్యవస్థ నిర్వీర్యమై ప్రజల్లో ఒక శాశ్వత అనుమానం పాదుకునే ప్రమాదం వుంది. నిజానికి ఉపాధ్యాయ వృత్తిలోకి రావడమంటే అంత సాదా సీదా వ్యవహారం కాదు. ప్రతి దశలోనూ జల్లెడ పట్టిన తర్వాతనే ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశించగలుగుతున్నాడనే నగ్న సత్యాన్ని ఎన్సీటీఈ, సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఉపాధ్యాయులు గా నియామకం కావడానికి టీటీసీ, బీఈడీ కోర్సులు పూర్తి చేసి వేలాది మందితో పోటీపడి డీఎస్సీలో మెరిట్ సాధిస్తేనే ఉద్యోగంలోకి రాగలగుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై అన్ని వర్గాలు స్పృహతో ఆలోచించాలి. వీలైనంత త్వరగా ఈ సమస్యని పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలపై వుంది. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలూ తగిన చొరవ తీసుకోవాలి. ఎందుకంటే విద్యారంగం కేంద్ర ప్రభుత్వ గుప్త ఆస్తి కాదు. లేని పక్షంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉభయ లూ నష్టపోయే ప్రమాదం ఉంది. ఎన్ని తీర్పులున్నా, ఎంత ఒత్తిడి వున్నా ఉపాధ్యాయులు అధైర్యపడొద్దు. ఉద్యోగాన్ని ఒక్క సెంటీ మీటర్ కూడా కదిలించే శక్తి ఎవరికీ లేదు. ఏ న్యాయస్థానం ఈ మీమాంసలు లేవనేత్తిందో అదే న్యాయ స్థానంలో మన వాణిని వినిపిద్దాం! ఎందరినో ఎన్నో పరీక్షలలో గట్టెక్కించిన మేధావిలోకం ఈ చిన్న సమస్యకే అదిరిపోయి మానసిక ఒత్తిడికి గురి కావద్దు. అనవసర అందోళనకు గురికావద్దు. జీవితమంటే ఉద్యోగం మాత్రమే కాదు. మీకూ కుటుంబాలున్నాయి. మీ మీద ఆధారపడిన వారున్నారు. బాధ్యతలున్నాయి. ఏ సమస్యనైనా సమిష్టిగా ధైర్యంగా ఎదుర్కొందాం. టెట్ అర్హత పొంది ఉన్నవారికి, లేని వారికీ, మినహాయింపు పొంది ఉన్నవారికి ఇది వేర్వేరు సమస్య కాదు. అందరిదీ. అందరం కలిసి పోరాడదాం అంతిమ విజయం మనదే!

# వేద భారతావనిలో ప్రముఖుడు

యాజ్ఞవల్క్య మహర్షి ప్రాచీన వేద భారతావనిలో ప్రముఖుడు. ఉపనిషత్తుల్లో ముఖ్యంగా కనిపించే యాజ్ఞ వల్క్యుడు శతపథ బ్రాహ్మణం (బృహదారణ్య కోపనిషత్తు సహా), యాజ్ఞవల్క్య సంహిత, యాజ్ఞవల్క్య స్మృతి రచించాడు. పూర్వం కురుపాంచాల దేశంలో గంగానదీ తీరాన చమత్కార పురం అనే నగరంలో ఉండే యజ్ఞవల్క్యుడు అనే మహర్షి, ఆయన భార్య సునందలకు జన్మించినవాడే యాజ్ఞ వల్క్యుడు. యాజ్ఞవల్క్యుడు భాష్కలుడి దగ్గర రుగ్వేదాన్ని, జైమిని మహర్షి దగ్గర సామవేదాన్ని, అరుణి దగ్గర అధర్వణ వేదాన్ని నేర్చుకున్నాడు. వైశంపాయన మహర్షి దగ్గర యజుర్వేదాన్ని నేర్చుకున్నాడు. అయితే యాజ్ఞవల్క్యుడికి అహంకారం, విద్యామదం లాంటివి కలిగాయి. ఆ విషయాన్ని గురువు గ్రహించాడు. యాజ్ఞవల్క్యుడిలో నానాటికీ విద్యామదం అధికం అయింది. అది ఆత్మాభిమానమని యాజ్ఞవల్క్యుడు అనుకున్నాడు. ఓ రోజున వైశంపాయనుడు తన మేనల్లుడు అధర్మమార్గంలో సంచరిస్తున్నాడని తెలుసుకొని కోపం పట్టలేక కాలితో అతడిని తన్నాడు. బ్రాహ్మణుడిని కాలితో తన్నటం బ్రహ్మహత్యతో సమానమని ధర్మశాస్త్రాలు చెప్పిన విషయాన్ని వైశంపాయనుడు కోపం చల్లారిన తర్వాత గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక ఆ పాపాన్ని ఎవరు పోగొడతారా అని మదన పడసాగాడు. ఆ విషయాన్ని గమనించిన యాజ్ఞవల్క్యుడు గురువు దగ్గరగా వెళ్ళి ఆ పాపాన్ని పోగొట్టడం తనవల్ల తప్ప మరెవరివల్లా కాదని గర్వంగా అన్నాడు. తనపాపం పోవటం అటుంచి అంతటి కష్టకాలంలోను శిష్యుడు అంత గర్వంగా మాట్లాడటం గురువుకు కోపం తెప్పించింది. ఇక తాను ఎలాంటి విద్యలు అతడికి నేర్పబోనని, అప్పటిదాకా నేర్పిన వాటి నన్నింటినీ కక్కి (ఏవీ గుర్తుంచు కోకుండా మరిచిపోయి) వెళ్ళిపొమ్మని అన్నాడు. గురు ద్రోహానికి అదే తగిన శిక్ష అని అన్నాడు. అయితే అప్పటికి యాజ్ఞవల్క్యుడు తాను ఆత్మాభిమానం పేరున గర్వభావాన్ని కలిగివున్నానని తెలుసు కొన్నాడు. క్షమించమని గురువును వేడుకొన్నా లాభం లేకపోయింది. అయితే తనవంతు బాధ్యతగా యాజ్ఞవల్క్యుడు తన తపోబలంతో గురువుకు సంక్రమించిన బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టి తాను నేర్చుకొన్న వేదాలను అక్కడే రక్తరూపంలో కక్కి వెళ్ళి పోయాడు. అయితే ఎంతో విచిత్రంగా యాజ్ఞవల్క్యుడు విసర్జించినదాన్ని కొన్ని తిత్తిరి పక్షులు గ్రహించి, అవి తిరిగి ఆ వేదసారాన్ని పలికిన పలుకులే తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధికెక్కాయి. గురువు దగ్గర నేర్చుకున్నదంతా అక్కడే వదిలివేసిన యాజ్ఞ వల్క్యుడు ఆత్మస్థైర్యంతో సూర్య భగవానుడిని ఆరాధించి ఆయన కరుణకు పాత్రుడై శుక్ల యజు ర్వేదాన్ని నేర్చుకున్నాడు. తర్వాత సరస్వతీదేవిని ఉపాసించి సమస్త విద్యలూ అభ్యసించాడు. ఉత్తమోత్తమ విద్యాధిపతిగా యాజ్ఞవల్క్యుడు పేరుతెచ్చు కున్నాడు. కణ్వుడు లాంటి ఉత్తమ శిష్యులు ఆయనదగ్గర శిక్షణ పొందాడు. ఒకసారి జనకుడు యాగం చేస్తూ మహర్షులందరినీ ఆహ్వానించాడు. యాజ్ఞవల్క్యుడికి ఆహ్వానం వెళ్ళింది. అలా మహర్షు లందరూ రాగానే జనకుడు మీలో ఎవరు గొప్ప విద్యా వంతులైతే వారొచ్చి ఇక్కడున్న ధనరాశులను తీసుకు వెళ్ళవచ్చు అని అన్నాడు. రుషు లంతా ఒకరిముఖాలు ఒకరు చూసుకొని తామందుకు అర్హులం కామను కొంటూ ఊరకనే కూర్చున్నారు. యాజ్ఞవల్క్యుడు మాత్రం లేచి తన శిష్యులను పిలిచి ఆ ధనరాశులను తన ఇంటికి తీసుకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. యాజ్ఞవల్క్యుడి ధైర్యాన్ని చూసిన తర్వాత అతడితో శాస్త్ర విషయాల్లో పోటీకి దిగి యాజ్ఞ వల్క్యుడిని అనర్హుడిగా నిరూ పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించక పోవడంతో జనకుడు ఆ రుషిని గొప్పగా పూజించి సత్కరించాడు. జనకునికి ఆయన అనేక ఆధ్యాత్మిక విషయాలను వివరించి చెప్పాడు. ఓ రోజున విశ్వావసుడు అనే గంధర్వుడు యాజ్ఞవల్క్యుడి వద్దకు వచ్చి, తత్వాన్ని ఉపదేశించమని కోరి ఎంతో నేర్చుకొని యాజ్ఞవల్క్య దంతటి గొప్పవాడు మరొకడు లేడని ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్ళి పోయాడు. అనంతరకాలంలో ఆ రుషి గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. ఆ రోజుల్లో కతుడు అనే ఒక రుషి ఉండేవాడు. ఆయనకు కాత్యాయని అనే పేరున్న కూతురుండేది. ఆమెను యాజ్ఞవల్క్యుడి కిచ్చి పెళ్ళిచేశారు పెద్దలు. అయితే మిత్రుడు అనే పేరున్న ఒక బ్రాహ్మణుడి కుమార్తె, పండితురాలైన గార్గి అనే ఆమె శిష్యురాలు అయిన మైత్రేయి యాజ్ఞవల్క్యుడిని వివాహ మాడాలని పట్టుబట్టింది. అప్పటికే అతడికి కాత్యాయనితో వివాహం కావటంతో పెద్దలకు ఏంచేయాలో అర్థంకాలేదు. గార్గి ఈ సమస్యకు సమాధానాన్ని వెతికింది. మైత్రేయిని కాత్యాయనికి పరిచయంచేసి ఆ ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉండేలా చేసింది. కాత్యాయని, మైత్రేయి ఒకరిని విడిచి మరొకరు ఉండలేని స్థితికి వచ్చారు. అప్పుడు గార్గి అసలు విషయాన్ని కాత్యాయనికి చెప్పింది. కాత్యాయని కూడా మైత్రేయి కోరికను మన్నించి యాజ్ఞ వల్క్యుడితో వివాహాన్ని జరిపించింది. అలా యాజ్ఞ వల్క్యుడికి ఇద్దరు భార్యల య్యారు. రుషులంతా యాజ్ఞ వల్క్యుడి లోని విద్యా వైభవాన్ని, యోగ ప్రాభవాన్ని గుర్తించి మాఘశుద్ధ పూర్ణిమ నాడు యోగీంద్ర పట్టాభిషేకం చేశారు. అతను ఋషులకు తెలియజేసిన విషయాలే యోగశాస్త్రమని యోగ యాజ్ఞవల్క్య మనీ ప్రసిద్ధికెక్కాయి. యాజ్ఞవల్క్యుడు భార్యలకు తత్వమునుపదేశించి సన్యసిం చాడు. ఆయన పేర ఒక స్మృతి ఉంది.

## పొదుపు.. దేశ ఆర్థిక భద్రతకు పునాది!

ప్రజలు తమ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి, భవిష్యత్తు ఖర్చులకు సిద్ధం కావడానికి, ఆర్థిక ఒత్తిడిని తగ్గించుకోడానికి డబ్బు ఆదా చేయడం ఒక ముఖ్యమైన అడుగు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ప్రజలు తమ పొదుపు డబ్బును తమ ఇంట్లో ఉంచడం లాంటివి చేస్తుంటారు. కానీ అదే పొదుపును ఇతర మార్గాలలో చేస్తే.. ఆ చేసిన పొదుపుకు ఆదాయం సమకూరడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందుతారు. దీనిపై అందరినీ చైతన్యపరిచేలా అవగాహన పెంచే ఉద్దేశ్యంతో ప్రపంచ వ్యాప్తంగా పొదుపు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది వ్యక్తులకే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరం చేయడానికి ప్రోత్సహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రపంచ పొదుపు దినోత్స వాన్ని జరుపుకుంటే భారత్ మాత్రం అక్టోబర్ 30న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటుంది. (కారణం ఇందిరా గాంధీ అక్టోబర్ 31వ తేదీన హత్యకు గురైన రోజు) 'పొదుపు' అంటే వనరులన్నింటినీ ఒకేసారి ఖాళీ చేయకుండా తెలివిగా అవసరాలకు తగ్గట్టుగా జాగ్రత్తగా ఉపయోగించడం. ఆదాయ అభివృద్ధి గణనీయంగా పెంచుకోవడం అందువల్ల, బ్యాంకులు, ఇతర వాణిజ్య వ్యాపారాలు పొదుపు పెట్టుబడి సంస్కృతిని ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. స్థిరమైన జీవితాన్ని పొందాలన్నా, వారసత్వాల భవిష్యత్తుకు స్థిరమైన ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నా ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి, కచ్చితమైన రాబడులకోసం పొదుపు సూత్రాలను పాటించాలి. డబ్బు నిర్వహణ లోపిస్తే జీవిత చరమాంకంలో బతుకు దుర్లభంగా మారుతుంది. ఈ పొదుపు అనేది మనుషులదే కాదు దేశానికి కూడా చాలా అవసరం. ప్రభుత్వాలు, ప్రజలకు అనవసరమైన ఉచితాలు ఇవ్వకుండా వైద్యం, విద్యను ఉచితంగా ఇవ్వగలిగితే ప్రజలు సంపాదించానికి, పొదుపు చేసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఉచితాలు అందించే ఏ ప్రభుత్వమైనా, దేశమైనా ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేయడమే అవుతుంది. ప్రజలకు పొదుపు చేయడం అలవాటు చేసి, బతకడం నేర్పిస్తే ఏ దేశమైనా శక్తివంతమైన దేశంగా మారుతుంది. ప్రజలు భద్రతతో ఉన్నారంటే దేశం పటిష్టమైన స్థానంలో ఉంటుంది. పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**కోటకొండ గ్రామపంచాయతీ కార్య దర్శి చాణిక్య రెడ్డి...**



**నారాయణపేట,అక్టోబర్30(సూర్యరేఖ)** నారాయణపేటమండలం,కోటకొండ గ్రామంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఇట్టి సమావేశంలో బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్, కన్వీనర్ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి చాణుక్యరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకొని గ్రామంలో బాల్య వివాహాల నిషేధానికి,పిల్లలపైన అఘాయిత్యాలు జరగకుండా చూసుకోవలసినటువంటి బాధ్యత ఈకమిటీ పైన ఉందన్నారు.బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ గా ప్రత్యేక అధికారి,కన్వీనర్ గా అంగన్వాడీ టీచర్,కమిటీ సభ్యులు పంచాయతీ కార్యదర్శి,ఆశా వర్కర్,మహిళా సంఘాల సభ్యురాలు పాఠశాల మేనేజ్ మెంట్ కమిటీచైర్మన్ యువజన సంఘాలు,మత పెద్దల,ఎన్జీవోలు,పిల్లల తల్లిదండ్రులు,బాలల సంఘాల నుంచి ఒక్కొక్కరిని బాలుడు,ఒక బాలికలను రొటేషన్ పద్ధతిలో ఎన్నుకుంటారని తెలియజేయడం జరిగింది.ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రభంజన్ రావు పురోహితులు పద్మనాభరావు మహిళా సంఘం సభ్యులు పిల్లలతల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి






**విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివి..**

**ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి.ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి.నాగరాజు**

**ఉప్పల్,అక్టోబర్30(సూర్యరేఖ)** పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి.నాగరాజు పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా గురువారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి.నాగరాజు మాట్లాడుతూ...విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల ఆశయాలను మన చట్టాలను గౌరవించుట ద్వారా రోడ్డు నియమాలను పాటించుట ద్వారా వారి ఆశయాలను గౌరవించవచ్చునని పేర్కొన్నారు. సమాజంలో శాంతిస్థాపన కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యతను అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలన్నారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం పోలీసులు ప్రజలు అండగా నిలుస్తూ మనోధైర్యాన్ని నింపుతున్నారని పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్ని నిర్వహించడం ద్వారా వారి త్యాగాలను మరోసారి గుర్తుకు చేసుకొని వారి ఆశయ సాధన కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమలవీరుల త్యాగాలు చరిత్రలు స్థిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.


# రహమత్ నగర్ డివిజన్ మీనాక్షి నగర్ లో నవీన్ యాదవ్ కు మద్దతుగా పరమేశ్వర్ రెడ్డి ఇంటింటి ప్రచారం





**జూబ్లీహిల్స్,అక్టోబర్30(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ మీనాక్షినగర్ లో ఇంటింటి ప్రచారంలో భాగంగా కాలనీ వాసులతో కలిసి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి,జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్,తో కలిసి పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని అభ్యర్థిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను గురించి వారికి తెలియజేస్తూ,జరగబోయే,ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి వారి పూర్తి మద్దతు ఇవ్వాలని కోరగా,.వారు దానికి సానుకూలంగా స్పందించి పూర్తి స్థాయి మద్దతు ఇస్తామని తెలియజేయటం జరిగిందని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.రహమత్ నగర్ డివిజన్లో గత నాలుగు రోజులుగా చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని,నవీన్ యాదవ్ స్థానికుడని ప్రతి ఒక్కరికి ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ఆపదలో ఆదుకుంటారని ప్రజలు చెబుతున్నారని తెలిపారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు తధ్యమని పేర్కొన్నారు. తాము మీనాక్షినగర్ లో నిర్వహించిన ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవంబర్ 1న బీసీ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ..




**హైదరాబాద్,అక్టోబర్30(సూర్యరేఖ)** తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నవంబరు1వ తేదీన బీసీ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య తెలిపారు.ముషీరాబాద్ తెలంగాణ జనసమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ లో బీసీ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ల అంశాన్ని9వ షెడ్యూల్లో చేర్చి పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు.42శాతం రిజర్వేషన్ల అమలు సాధనకై తెలంగాణ జనసమితి నవంబర్ 1వ తేదీన బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బిసి సదస్సు ఏర్పాటు చేసిందని ఆయన వెల్లడించారు.ఈ సదస్సుకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని బీసీ సోదరులందరూ హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ జన సమితి అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ యాదవ్,నగర ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జయపాల్ రెడ్డి,నాయకులు గడ్డం శంకర్, సత్యనారాయణ,కృష్ణ,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడలో గ్రామపంచాయతీ వర్కర్ మృతి..

**నివాళులర్పించిన గ్రామ పంచాయతీ సిబ్బంది..**



**ధన్వాడ,అక్టోబర్30 (సూర్య రేఖ)** మండల కేంద్రమైన ధన్వాడలో గ్రామపంచాయతీ వర్కర్ వాటర్ మెన్ నరసింహులు అనారోగ్యంతో మృతి చెందారు.గత కొన్ని రోజుల నుంచి నరసింహులు అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడు.. వాటర్ మెన్,గా సేవలందించిన నరసింహులు అకాల మరణంపై పలువురు సంతాపం వ్యక్తంచేశారు.ఆయన పార్థిహదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. ఎమ్మెల్యే పి.మాధవరెడ్డి,గ్రామ మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి,గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు,బిల్ కలెక్టర్ బాలకృష్ణ,కారోబార్ భాను,తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది,అఖిలపక్ష నాయకులు, పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ పార్థిహదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి..

**ఎంపీడీవో రాజిరెడ్డి..**



**నిజాంపేట,అక్టోబర్30(సూర్యరేఖ)** ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజిరెడ్డి అన్నారు.ఈ మేరకు నిజాంపేట మండలం నార్లపూర్ గ్రామంలోని గురువారం సొసైటీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.దళాలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నటువంటి కొనుగోలు కేంద్రాలను సద్వినియం చేసుకోవాలన్నారు.అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవంతి,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనండి సారూ.!



**నిజాంపేట,అక్టోబర్30(సూర్యరేఖ)** మండల కేంద్రంలో బుధవారం అర్ధ రాత్రి కురిసిన అకాల వర్షానికి సబ్ మార్కెట్ యార్డ్ లో ఎండబోసినటువంటి వరి ధాన్యం కాస్త తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఈ చెడగొట్టు వానలతో చేతికి వచ్చిన పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.ఇకనైనా అధికారులు స్పందించి తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసినట్లయితే రైతులకు ఎంతో మేలు చేసిన వారు అవుతారని రైతన్నలు ప్రాధేయపడుతున్నారు.

## రన్ ఫర్ యూనిటీ మార్చ్ జయప్రదం చేద్దం భారీగా తరలిరండి..

**బండారి రాధిక.**



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 30(సూర్యరేఖ)**భారతదేశ తొలి ఉపప్రధానిగా హెూమ్ శాఖా మంత్రిగా విశేష సేవలందించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా 31న శుక్రవారం ఉదయం 8.30 గంటలకు,రన్ ఫర్ యూనిటీ మార్చ్ ను జయప్రదం చేద్దంమని పార్టీ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు భారీగా తరలిరలి రావాలని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ బండారి రాధిక పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చెసిన సమావేశంలో బండారి రాధిక మాట్లాడుతూ...మన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నేతృత్వంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎల్.బీ స్టేడియం నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ అసెంబ్లీ వరకు రన్ ఫర్ యూనిటీ మార్చ్ ఉంటుందిని,అన్ని డివిజన్ అధ్యక్షులు, డివిజన్ కమిటీలు,మోర్చా కమిటీలు,క్రియాశీల సభ్యులతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,ర్యాలీ ఉదయం9నుండి ఉదయం10గంటల వరకు మాత్రమే ఉంటుందని,అందరూ ఉదయం 8.30 గంటలలోపు రావాలని బండారి రాధిక అభ్యర్థించారు.

# మహిళా అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను అందించడం మెగా జాబ్ మేళా ఉద్దేశం





**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్30(సూర్యరేఖ)**ప్రస్తుతం జరుగుతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లల్లో భాగంగా సౌత్ వెస్ట్ జోన్ హైదరాబాద్ సిటీ పోలీస్,డెక్కన్ బ్లాస్టర్స్ తో కలిసి గురువారం ఉదయం 8గం.నుండి మధ్యాహ్నం 1గం వరకు హైదరాబాద్ లోని మెహదీపట్నం లోని రూఫ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సౌత్ వెస్ట్ జోన్ డిసిపి జి.చంద్రమోహన్ హాజరయ్యారు.డిసిపి మాట్లాడుతూ...ఈ జాబ్ మేళాలో ఐటీ సాఫ్ట్వేర్ బ్యాంకింగ్ ఫార్మసీ టెక్నికల్ అకౌంట్స్ సేల్స్ మరియు మార్కెటింగ్ వంటి విభిన్న రంగాలలో కొత్తవారికి అనుభవజ్ఞులైన పురుష,మహిళా అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యంమని అన్నారు.ఈ మెగాజాబ్ మేళాలో 60కి పైగా కంపెనీలు పాల్గొన్నాయని,ఇవి వివిధ రకాల ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నాయని అన్నారు. ఈ జాబ్ మేళాకు 1000 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరైనారని,ఎంపికైన దాదాపు 500మంది అభ్యర్థులకు పాల్గొన్న సంస్థల నుండి స్పాట్ ఆఫర్ లెటర్లు వచ్చాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన సౌత్ వెస్ట్ జోన్ పోలీసులలోని అన్ని ఎసిపిలు ఎస్హెచ్ఓలు ఇతర సిబ్బందికి డిసిపి జి.చంద్రమోహన్ కృతజ్ఞతలు తెలిపారు

# పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో సైకిల్ ర్యాలీ






**ఆరోగ్యానికి,సేవకుచిహ్నంగా ముందడుగు..**

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణ పేట,అక్టోబర్30(సూర్యరేఖ)** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీనీ ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.జిల్లా పోలీస్ పరేడ్ మైదానం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీసావర్కర్ చౌరస్తా,సత్యనారాయణ చౌరస్తా,అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగి,చివరగా ఎస్పీ కార్యా లయం వద్దముగిసింది. ఈసందర్భంగా ఎస్పీ యువత విద్యార్థులు చిన్నారులు, పోలీసులు ప్రజలతో కలిసి సైక్లింగ్ చేస్తూ"జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్"అంటూ నినాదాలు ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి రోజు సైక్లింగ్ చేయడం వల్ల శరీర దృఢత్వం పెరగడమే కాకుండా మనసుకు ఉత్తేజం లభిస్తుందని ఆరోగ్యంగా ఉంటే విధుల్లో మరింత సమర్థతతో రాణించవచ్చు అని తెలిపారు.పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా ఈ సైకిల్ ర్యాలీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినివ్వాలి అని ఎస్పీ. పేర్కొన్నారు.అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్ర మంలో పాల్గొన్న ప్రజలకు విద్యార్థులకు పోలీస్ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈర్యాలీలో అదనపు ఎస్పీ ఎండిరియాజ్ హుల్ హక్,డీఎస్పీలు నల్లపు లింగయ్య,మహేష్,సీఐ శివశంకర్,ఆర్ఐ నరసింహ ఎస్సైలు వెంకటేశ్వ ర్లు,నరేష్ శివశంకర్, శ్వేత,శిరీష,కృష్ణ చైతన్య పిఈటి రమణ,యోగ సభ్యులు,విద్యార్థులు,ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో నియామకం

**వెంగల్‌రావునగర్ డివిజన్ కోఆర్డినేటర్‌గా జమ్మికుంట విజయ్‌కుమార్**



**బెల్లంపల్లి,అక్టోబర్30(సూర్యరేఖ)**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం తరఫున బెల్లంపల్లికి చెందిన జమ్మికుంట విజయ్‌కుమార్‌ను వెంగల్‌రావునగర్ డివిజన్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ నియామకానికి కారణమైన ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు,తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్,బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి,లకు జమ్మికుంట విజయ్‌కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన విశ్వాసానికి న్యాయం చేస్తూ పార్టీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు.

## తుఫాన్ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి అండ



**బెల్లంపల్లి,అక్టోబర్30(సూర్యరేఖ)**బెల్లంపల్లి పట్టణంలోని 31వ వార్డు మహ్మద్ కాశీం బస్తీలో అకాల వర్షంతో నాగమల్ల సోమయ్య ఇల్లు కూలిపోయింది.ఈ విషయం తెలుసుకున్న బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి వెంటనే స్పందించి,బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక నేతలు,అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.స్థానిక బస్తీ ప్రజలు ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి తక్షణ స్పందనపై సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ... "ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తమతో ఉంటానని,తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం తగిన సహాయం అందిస్తుంది"అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిపిఓ కృష్ణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లెంకల శ్రీనివాస్, ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు బుకాల రంజిత్ కుమార్,మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లెంకల శ్రావణ్ కుమార్,మాజి కౌన్సిలర్ రాజలింగు,దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న విద్యుత్ శాఖ ప్రజాబాట..




**నిజాంపేట,అక్టోబర్30(సూర్యరేఖ)**మండల కేంద్రంలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ గణేష్ మాట్లాడుతూ... గ్రామాలలో విద్యుత్ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరించేందుకే ప్రజాబాట కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ సంజీవ్,మునిరాజు, లైన్మెన్ బైరం రమేష్,ఆర్టిజన్ మధు,రఘు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## నాగల్ గిద్ద ఎంపీడీవోగా స్పందనదుర్గా బాధ్యతల స్వీకరణ..



**నాగల్ గిద్ద,అక్టోబర్30(సూర్యరేఖ)** నూతన ఎంపీడీవోగా స్పందనదుర్గా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు ఇప్పటివరకు ఇన్చార్జ్ ఎంపీడీవోగా మహేశ్వరరావు విధులు నిర్వహిస్తుండగా ఇటీవల గ్రూప్1లో సెలెక్ట్ అయిన స్పందనదుర్గకు ప్రభుత్వం నాగల్ గిద్ద మండలఎంపీడీవో కేటాయించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది ఎంపీడీవోను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేశ్వరరావు,సిబ్బంది పాల్గొన్నారు

## దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించిన అధికారులు



**ధన్వాడ,అక్టోబర్30(సూర్యరేఖ)** ధన్వాడ గ్రామపంచాయతీ వర్కర్ నరసింహ అనారోగ్యంతో మృతి చెందారు.నరసింహ అంత్యక్రియల కోసం గ్రామ పంచాయతీ ద్వారా రూ. 10వేల నగదును ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేశ్వర్ రెడ్డి,గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు,సిఐటియు నాయకులు వెంకటరామిరెడ్డి బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన మెదక్ ట్రాన్స్కో డీఈ



**మెదక్,అక్టోబర్30(సూర్యరేఖ)** పౌల్ట్రీ ఫామ్ లో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు డబ్బులు డిమాండ్ చేసిన మెదక్ ట్రాన్స్కో డీఈ షేక్ షరీఫ్ చాంద్ బాషా గురువారం ఏసీబీ అధికారులకు చిక్కాడు.పాపన్నపేట మండలం సీతానగరంకు చెందిన పాపగారి భాస్కర్ ఫౌల్ట్రీ ఫామ్ లో ట్రాన్స్ ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకోగా అందుకు రూ.40 వేలు డిమాండ్ చేశాడు. ఇందుకుగాను రైతు నాలుగు రోజుల క్రితం డిజిటల్ పేమెంట్ ద్వారా రూ.9వేలు చెల్లించి రూ.21 వేలు గురువారం ఇస్తానని చెప్పాడు. ఒప్పందం ప్రకారం డీఈ డబ్బులు ఇవ్వాలని అడగగా బాధిత రైతు ఏసీబీనీ ఆశ్రయించాడు. అధికారులు పక్కాగా వల వేసి రూ.21 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ రెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు. సదరు ట్రాన్స్కో అధికారిపై కొంత కాలంగా భారీగా అవినీతి ఆరోపణలు సంబంధితశాఖ చర్యలు తీసుకోలేదు.

### ఆదర్శవృద్ధ అనాథాశ్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు తనయుడు రేగళ్ల కరుణ్ తేజరెడ్డి జన్మదిన వేడుకలు..



**ఉప్పల్,అక్టోబర్30(సూర్యరేఖ)** కాప్రా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి,వారి చిన్న కుమారుడు రేగళ్ల కరణ్ తేజరెడ్డి పుట్టినరోజులు వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్థానిక ఆదర్శవృద్ధ అనాధాశ్రమంలో పుట్టినరోజు జరుపుకున్నారు.అనంతరం రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ...తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటినుండి సేవా కార్యక్రమంలో పాల్గొనే విధంగానేర్పించాల్సిందిగా కోరారు.పెద్దవారి ఆశీస్సులు తీసుకోవడం నిండు నూరేళ్లు అష్ట ఆయురారోగ్యాలతో కలకాల గా జీవించాలని వారు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాల్ రెడ్డి,ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

### హరీశ్‌రావు తండ్రి చిత్రపటానికి ఎమ్మెల్సీ కవిత నివాళి..



**మణికొండ,అక్టోబర్30(సూర్యరేఖ)** మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి ఎమ్మెల్సీ కవిత,భర్త అనిల్ కుమార్,తో కలిసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు కుటుంబ సభ్యులకు కవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ నెల 28వ తేదీన తెల్లవారుజామున తన్నీరు సత్యనారాయణ కన్నుమూసిన సంగతి తెలిసిందే.పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**నిజాంపేట,అక్టోబర్3(సూర్యరేఖ)** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కొమ్మట సత్యనారాయణ మేనల్లుడు శ్రీనాథ్ స్వప్న,వివాహం హవేలీ ఘనాపూర్ లోని సిద్ధి వినాయక ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగిన వివాహానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు పంజా మహేందర్, నసీరుద్దీన్,బాల్ నర్సింలు,రాజిరెడ్డి, సామల మహేష్,సిద్ధ గౌడ్,చిన్న అంజాగౌడ్,తీగల రాజేందర్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గెలుపుకు కార్యాచరణ ప్రచారం..



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్30 (సూర్యరేఖ)** జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ గోల్కొండ పదాధికారులతో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ శ్రీనగర్ కాలనీలో డివిజన్ కోఆర్డినేషన్ బైఠక్ నిర్వహించడం జరిగిందని భారతీయ జనత పార్టీ గోల్కొండ ప్రధాన కార్యదర్శులు పడాల అనంత కృష్ణ,సీనియర నాయకులు సుభాష్ చందర్ జీ,లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భముగా పడాల అనంతకృష్ణ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో నియోజకవర్గంలో అందరూ ఐక్యంగా నిలబడి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గెలుపు కోసం ఓటు వేయాలని పడాల అనంత కృష్ణ కోరారు.ఈ సమావేశంలో కట్ట నర్సింగ్,ద్విజ్వర్ సింగ్,శివయాదవ్,కళ్యాణి,ఉప్పరి పాండు,పూజారి ప్రభు,వుడ్డాడి జగదీష్ రాజేశ్,జగదీష్,బి.శ్రీకాంత్, సతీష్ మనోజ్ ఏ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాల్లో కోత విధించిన ఏపీఓపై చర్యలు చేపట్టాలి

ఫీల్డ్ అసిస్టెంట్,లు



**మందమర్రి,అక్టోబర్30(సూర్యరేఖ)** మందమర్రి మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాల నుండి సమాచారం ఇవ్వకుండా కోత విధించిన ఏపీఓపై చర్యలు చేపట్టాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఎంపీడీవో ఎన్.రాజేశ్వర్ కు గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఈద లింగయ్య మాట్లాడుతూ...అక్టోబర్ నెల వేతనం నుండి 250 రూపాయలు మండలంలోని ప్రతి ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనం నుండి మినహాయించారని, ఎందుకోసం మినహాయించారో కారణాలు చెప్పకుండా వేతనాలు కూడా విధించడం సరైంది కాదన్నారు.అలాగే సారంగపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కు 1397,శంకర్ పల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కు రూ.1011 విభేదాలతో వేతనాలలో కోత విధించడం సరైనది కాదన్నారు.సరైన కారణాలు చూపకుండా,ముందు సమాచారం ఇవ్వకుండా వేతనాలు కోత విధించిన ఏపీఓపై చర్యలు తీసుకొని,తమ వేతనం తమకు ఇప్పించాలని వారు అధికారులను కోరామని తెలిపారు.సంబంధిత అధికారిపై డిపార్ట్మెంటల్ విచారణ జరిపి,న్యాయ ప్రక్రియను కొనసాగించాలని కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో మహత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు మందమర్రి మండల ప్రెసిడెంట్ చెట్టి సత్యనారాయణ,బుక్కె భూమా సెగ్యం శంకర్,భోగ జ్యోతి,నెండు గురి బాపురావు దుర్గం రవికుమార్, పుస్తె రవికుమార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం





ప్రభు పూజారి

**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్30(సూర్యరేఖ)** జూబ్లీ హిల్స్అసెంబ్లీ ఉపఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ శ్రీనగర్ డివిజన్ ముదిరాజ్ కుల సంఘాలతో ప్రచారం చేసి రేపటి మీటింగ్ కి తప్పకుండా ప్రతి ఒక్కరు రావాలని కోరడం జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర రాష్ట్ర సహ కార్యదర్శి ఓబీసీ మోర్చా ప్రభు పూజారి పేర్కొన్నారు.బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు వెన్న ఈశ్వరప్ప ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శులు ప్యారసాని వెంకటేష్ మోకాల వెంకటేష్,ఓబీసీ మోర్చా శ్రీనగర్ డివిజన్ అధ్యక్షులు ఉమేష్,లతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగిందని ప్రభు పూజారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గెలుపు కోసం అందరూ ఐక్యంగా నిలబడి హృదయ పూర్వకంగా ఓటు వేయాలని తోటి వారితో వేయించాలని ప్రభు పూజారి జూబ్లీహిల్స్ ప్రజలకు నొక్కిచెప్పారు.

# సేవాభావంతో ముందుకువచ్చిన ఆర్ఎంపీలు







పోలీస్ అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా రక్తదానం..

**బెల్లంపల్లి,అక్టోబర్30(సూర్యరేఖ)** అమరవీరుల సంస్మరణ ఉత్సవాల సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి పోలీసుల ఆహ్వానం మేరకు పట్టణం,మండల పరిధిలోని ఆర్ఎంపీ,పీఎంపీ గ్రామీణ అనుభవ వైద్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేస్తూ తమ సేవాభావాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన ఆర్ఎంపీ డాక్టర్ల సేవలను ఏసిపి రవికుమార్ బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు ప్రశంసిస్తూ,వారి సేవాభావం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పట్టణ అనుభవ వైద్యుల సంఘం అధ్యక్షుడు పోలు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు దశరథం బత్తుల రవి, రమణా చారి,అజీజ్, బ్రహ్మానందం టీఎల్ చారి వెంకన్న రాజేశం నల్లరవి దత్తు,హైమత్ వెంకటేశ్వర్లు, కనకరాజు శేఖర్,మధు తదితరులు పాల్గొన్నారు.

### బదిలీపై వెళుతున్న అధికారికి ఘనంగా సన్మానం..

**మందమర్రి,అక్టోబర్30(సూర్యరేఖ)** ఏరియాలో ఎస్ఓటు జిఎంగా విధులు నిర్వహించి, బదిలీపై జిఎంహెచ్ ఆర్ డి కార్పొరేట్ కు వెళ్తున్న ఆర్.విజయ ప్రసాద్ ను ఏరియ జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ,ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు.ఏరియ జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న విజయ ప్రసాద్,కు జ్ఞాపికను అందజేసి,శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... ప్రతి ఒక్క అధికారి ఉన్న స్థలము నుండి వేరొక స్థలంలోకి బదిలీపై వెళ్లడం అనివార్యం అని అన్నారు.ఈ సందర్భంగా ఎస్ఓటు జిఎంగా ఆర్.విజయప్రసాద్ మందమరి ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు.ఈ




కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జిఎం సేఫ్టీ రఘుకుమార్,పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్,ఏరియా హెచ్ఓడిలు పాల్గొన్నారు.

# విజిలెన్స్ నిత్య జీవితంలో భాగంగా కావాలి





**దోషులను పట్టుకోవడమే కాదు..తప్పులను ముందుగానే నివారించడమే నిజమైన విజిలెన్స్**
**విజిలెన్స్ డీజీ శిఖా గోయల్**

**మందమర్రి,అక్టోబరు30(సూర్యరేఖ)** ప్రతీ వ్యక్తి కేవలం వృత్తి జీవితంలోనే కాకుండా నిత్య జీవితంలోనూ నీతి,నిజాయతీల అత్యున్నత ప్రమాణాలను పాటించినప్పుడే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడమే కాకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడం సాధ్యమవుతుందని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టర్ జనరల్,ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ పేర్కొన్నారు. భారతీయ ఇతిహాసాలతోపాటు శతాబ్దాలుగా వస్తున్న వారసత్వ విలువల్లోనూ సత్య, ధర్మ మార్గంలో వెళ్లాల్సిన ఆవశ్యకతను ప్రబోధించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.విజిలెన్స్ వారోత్సవాలను కేవలం వారం రోజులకు పరిమితం చేయకుండా అన్ని రోజులు కూడా నిబద్ధతతో పనిచేయాలన్నారు. నీతి,నిజాయతీ,పారదర్శకత పాటించడం వల్ల కష్టాలు మాత్రమే మిగులుతాయని, పనులు పూర్తి కావన్న అపనమ్మకాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతీ అంశాన్ని మానవీయ కోణంతో చూడాలన్నారు. నిజాయతీతో పనిచేయడం ద్వారా ఢిల్లీ మెట్రో రైలును సకాలంలో,తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలమని శ్రీధరన్ నిరూపించారని,సహకార రంగంలో పారదర్శకతను పాటించడం ద్వారా అమూల్ ద్వారా క్షీర విప్లవాన్ని సృష్టించిన కురియన్లు కూడా నైతిక విలువలకు గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు.ఇలా ఎందరో వ్యక్తులు నిజాయతీతో సేవలు అందించి ప్రజల మన్ననలు అందుకున్నారని తెలిపారు.అదే సమయంలో నిజాయతీగా ఉంటూ పనులు చేయకపోవడం కూడా నేరమే అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పౌరులకు పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు.విజిలెన్స్ అంటే ప్రతీ ఒక్కరినీ నేరస్థులుగా చూడటం నేరస్థులను పట్టుకోవడం కాదని,నేరం జరగకుండా ఎవరూ నేరం చేయడానికి సిద్ధపడకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే విజిలెన్స్ ముఖ్యఉద్దేశమని పేర్కొన్నారు. నిజాయతీగా పనిచేసిన వారి గొప్పతనం గురించి సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని,ఆత్మ సంతృప్తి కోసం అంతరాత్మను వంచించుకోకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు.దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించే అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎండి ఎన్.బలరామ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. సింగరేణి 136ఏళ్ల ప్రస్తానంలో సాధించిన విజయాలను,సింగరేణి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపడుతున్న విస్తరణ ప్రణాళికలను,సింగరేణిలో మహిళా సాధికారత కోసం చేపట్టిన చర్యలను వివరించారు.అనంతరం శిఖా గోయల్ ను ఘనంగా సన్మానించారు.సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు,తిరుమల రావు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న, జీఎం(కోఆర్డినేషన్) టి.శ్రీనివాస్ అన్ని ఏరియాల జీఎంలు,కార్పోరేట్ జీఎంలు,వివిధ విభాగాల అధిపతులు,అధికారులు పాల్గొన్నారు.

# రామంతపూర్ జెఎస్పిఎస్ ప్రభుత్వ హెూమియో మెడికల్ కళాశాలలో 2025-2026 బిహెచ్ఎంఎస్ వైద్య విద్య విద్యార్థుల నూతన బ్యాచ్ పరిచయ కార్యక్రమం




**హెూమియోపతి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.లింగరాజు**





**ఉప్పల్,అక్టోబర్30 (సూర్యరేఖ)** రామంతపూర్ లోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హెూమియో మెడికల్ కళాశాలలో కళాశాల గురువారం గురువారం 2025 2026 విద్యా సంవత్సరం బిహెచ్ ఎంఎస్ నూతన బ్యాచ్ పరిచయ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్,ఆయుష్ విభాగం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ లింగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగం డిఎస్పి సైదులు, సీఐ శ్రీనివాసులు ముఖ్యఅతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు యాంటీ నార్కోటిక్ విభాగం కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు ర్యాగింగ్ కు గురికాకుండా పడాల్సిన జాగ్రత్తలను, మాదక దవ్యాలకు దూరంగా ఉంటే వారి భవిష్యత్తు ఎలా ఉంటుందో వివరించారు. ర్యాగింగ్ భూతానికి ఏ ఒక్క విద్యార్థి బలికాకుండా అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైనా వారి జీవితాలు ఎలా నాశనం అయ్యాయో కూలసీకంగా వివరించారు. ర్యాగింగ్ డ్రస్ వినియోగం నివారణకు ప్రభుత్వం అనేక కట్టడి చర్యలు చేపడుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అనంతరం జేఎస్పిఎస్ ప్రభుత్వ హెూమియో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. లింగరాజు గత పది సంవత్సరాలుగా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తూ, విద్యార్థులకు సరైన హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. హెూమియోపతి వైద్య విద్య అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి,ఈ. కృష్ణమూర్తి,లు మాట్లాడుతూ... హెూమియోపతి మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా రామంతపూర్ ప్రభుత్వ హెూమియో మెడికల్ కళాశాలలో అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా డ్రగ్సుదూరంగా ఉండాలని,సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

# ప్రజల సమిష్టి సహకారంతోనే అవినీతి నిరోధం

**జిఎం ఎన్ రాధాకృష్ణ**



**మందమర్రి,అక్టోబర్30(సూర్యరేఖ)** ఒకరు మాత్రమే పోరాడితే అవినీతిని పూర్తిగా నిర్మూలించలేరని,ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల ఉద్యోగులకే కాదు,అవినీతి నిర్మూలనలో సామాన్య పౌరుడికి కూడా బాధ్యత ఉంటుందని,అవినీతి నిర్మూలనలో అందరినీ భాగస్వాములను చేయుటే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అన్నారు.ఏరియాలోని జీవీటీసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మందమర్రి, బెల్లంపల్లి,శ్రీరాంపూర్ అధికారులకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమరి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ పాల్గొని ప్రసంగిస్తూ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ వారి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలతో పాటు మన సింగరేణి సంస్థలో కూడా ఈ సంవత్సరం అక్టోబర్ 27నుండి నవంబర్ 2వ తారీఖు వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సింగరేణిలోని అన్ని గనులు డిపార్ట్మెంట్లో నిర్వహించ బడతాయని తెలిపారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ వారి ఆదేశానుసారం 1987వ సంవత్సరము నందు మన సింగరేణి కంపెనీలో నిఘా విభాగం (విజిలెన్స్ విభాగం) ఏర్పాటు చేయబడిందని, చీఫ్ విజిలెన్స్ఆఫీసర్ బి.వెంకన్న ఐ.ఆర్.టి.ఎస్ ఆధ్వర్యంలో ఈవిజిల ెన్స్ విభాగం పనిచేస్తుందని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్యపరిచి అవినీతి నిర్మూలనలో అందరినీ భాగస్వాములను చేయుటే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్రమంలో కిషోర్ బగాడియో హైదరాబాద్ (గెస్ట్ లెక్చరర్ ఆన్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్)ఈ కార్యక్రమానికి హాజరై అధికారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి,కె.రాజేందర్ ఏ.జీ.ఎం శ్రీరాంపూర్ కిషోర్ బగాడియో(గెస్ట్ లెక్చరర్ ఆన్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్) హైదరాబాద్ మందమర్రి విటిసి మేనేజర్ శంకర్ మందమర్రి బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎలక్షన్ ప్రచారంలో దూసుకుపోతున్న ఉప్పల్ నాయకులను ప్రశంసించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**ఉప్పల్,అక్టోబర్30(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ ఎలక్షన్ ప్రచారంలో తనదైన శైలిలో వినూత్న ప్రచారంతో దూసుకుపోతున్న ఉప్పల్ బూత్ ఇన్చార్జీలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,ఎదుల కొండల్ రెడ్డి,మాస శేఖర్,కోకొండ జగన్,చేర్యాల శ్రీనివాస్,మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో మాట్లాడుతూ... ఉప్పల్ నాయకులు బాగా కష్టపడి పని చేస్తున్నారని వారిని ప్రశంసించడం జరిగింది.అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ...పార్టీకి అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికి పార్టీలోతగిన గుర్తింపు లభిస్తుందని,మునుముందు మంచి అవకాశాలు వస్తాయని అంకితభావంతో ప్రతి ఒక్కరూ పనిచేసే పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో శ్యామ్ బంటి సాయి తదితరులు పాల్గొన్నారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే..



**నర్సాపూర్,అక్టోబర్30(సూర్యరేఖ)**హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన స్వామిగౌడ్ కుమారుడైన బబ్లు వివాహం నర్సాపూర్ సమీపంలోని ఎస్వీఆర్ కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది.ఈ వివాహానికి ఎమ్మెల్యే సునితా రెడ్డి హాజరై నవ దంపతులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలియజేశారు.ఆమె వెంట బీఆర్ఎస్ శ్రేణులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్,గొల్ల కృష్ణ,విప్లవ్ ఖన్నా,తంగేడుపల్లి ఆంజనేయులు శ్రీకాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## డిజిల్ దొంగతనం చేసిన వ్యక్తులు పట్టుకున్న పోలీసులు..



**మెదక్,అక్టోబర్30(సూర్యరేఖ)** డీజిల్ దొంగతనం చేస్తున్న దొంగలను శంకరంపేట్ పోలీసులు చాకచక్యంగా చేదించారు.?యువకులు చదువుమని చెడు అలవాట్లకు బానిసాయి దొంగతనం అలవాటు పడిన నేరస్తలను జైలుకు పంపడం అయినది.?ఈనెల 29వ తేదీ శంకరంపేట్ ఎస్సై,సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా చీలపల్లి బ్రిడ్జి వద్ద ఒక బలెనో కార్ నెంబరు టీఎస08 ఎఫ్ఎఫ్3047 గల కారును ఆపి తనిఖీ చేయగా అందులో 30 లీటర్ల ఖాళీ డబ్బాలు 6 ఉన్నాయి. అందులో ముగ్గురు వ్యక్తులు పట్టుకున్నారు.సబవత్ రాహుల్,కురుమ గణేష్,తోకల నాగరాజు లను అదుపులోకి తీసుకున్నారు. కారులో డబ్బాల గురించి విచారించగా వాళ్లు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారిని కారుతో సహా పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి విచారించారు. హైదరాబాద్ లో కూకట్ పల్లి ప్రాంతంలో ఉంటూ ఆటో డ్రైవింగ్ చేస్తున్నాడు.వాటి వల్ల వచ్చే డబ్బులు వారికి జల్సాలకు సరిపోవడం లేదని ఈజీగా డబ్బు సంపాదించడం కొరకు ఏదైనా దొంగతనం చేద్దామని ముగ్గురు కలిసి నిర్ణయించుకొని వారికి తెలిసిన బోరబండకు చెందిన అన్వర్ అనే వ్యక్తి పరిచయంతో డీజిల్ దొంగతనం చేయడం ప్రారంభించారు.రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీలలో డీజిల్ దొంగలించి అన్వర్ అనే వ్యక్తికి బోరబండలో అమ్మి ఆ డబ్బులతో జల్సాలు చేయడం ప్రారంభించారు. అదేవిధంగా ఈనెల 22వ తేదీ నిజాంపేటలో బలేనో కారు అద్దెకు తీసుకొని ఔటర్ రింగ్ రోడ్ జోగిపేటలో డీజిల్ లారీల నుండి దొంగిలించి అన్వర్ కు అమ్మడం జరిగింది.దొంగలను అరెస్ట్ చేసి మ్యాజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.నాలుగో నిందితుడు అన్వర్ పరారీలో ఉన్నాడు.

# అవినీతిని నిర్మూలిద్దాం

**వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విజిలెన్స్ అవగాహన సదస్సు..**
**వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్**

**రాజేంద్రనగర్,అక్టోబర్30 (సూర్యరేఖ)** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఇన్ఫోసిమెంట్ ఆఫీసర్ పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని పేదలందరికి అందాలని పేర్కొన్నారు. అవినీతి రహిత భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని సూచించారు. విజిలెన్స్ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని మెరుగైన సమాజం కోసం అందరూ పాటుపడాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు.




అవినీతిరహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం విద్యార్థిని విద్యార్థుల బాధ్యత అని ప్రతి ఒక్కరూ విజిలెన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ...విజిలెన్స్ యొక్క ప్రాముఖ్యతను, విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడి అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా చూడడం,సంక్షేమ పథకాలు ప్రజలకు సరైన రీతిలో అందించటం విజిలెన్స్ యొక్క ముఖ్యఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో వారి భవిష్యత్తు ప్రణాళికల పై ముచ్చటించారు. దేశ భవిష్యత్తు భావితరాల మీద ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ విజిలెన్స్ శాఖకు సహకరించాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.రామిరెడ్డి విజిలెన్స్ అధికారులు కళాశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యం





**సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్..**
**జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి..**
**మాజీ మంత్రి,మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి**

**రాజేంద్రనగర్,అక్టోబర్30(సూర్యరేఖ)** ప్రజలు బీఆర్ఎస్ పార్టీ పాలనను తిరిగి కోరుకుంటున్నారని మాజీ మంత్రి,మహేశ్వరం శాసన సభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,పి.కార్తీక్ రెడ్డి చేతులు మీద పార్టీలోకి ఆహ్వానించారు. సులేమాన్ నగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన మొహమ్మద్ అకీల్ ఇతర పార్టీ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం అవుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా,కౌలు రైతుల విషయం మరిచిపోయిందన్నారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వలేదని,నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇంత వరకు ఏలాంటి హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతోందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలను సూచించారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఇకపై రాబోయే ఏ ఎన్నికలోనైనా బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ షకీల్ మొహమ్మద్ బిన్ హామీద మొహమ్మద్ చోటు అబ్దుల్ రెహమాన్ సులేమాన్ నగర్ అధ్యక్షులు మొహమ్మద్ జహీరుద్దీన్ మొహమ్మద్ నయీమ్ మొహమ్మద్ నవాజ్ మొహమ్మద్ ఇబ్రహీం,సయ్యద్ అమీర్ షానవాజ్ షైక్ బాబా,మొహమ్మద్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం ప్రజలకు తాయిలం చూపిస్తున్న హస్తం నాయకులు





**మణికొండ,అక్టోబర్30(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త కొత్త డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీలను తుంగలో త్రొక్కి సాగుతున్న ప్రస్తుత ప్రభుత్వ పాలనాధికారులు ఇప్పుడు కొత్త నినాదం తెరపైకి తెచ్చి ముస్లిం మైనార్టీలకు తాయిలం లాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు కాగానే ముస్లిం నేత అజారుద్దీన్ కు మంత్రి పదవీ,మిగతా అందరికీ అందుబాటులో ఉండి అన్ని సదుపాయాలు కల్పిస్తామని సొల్లు కబుర్లు చెబు తున్నారని ముస్లిం మహిళలు యువత వాపోతున్నారు. ప్రస్తుత ఎన్నికలప్పుడే తీవ్ర పదజాలలను వినుచున్న తాము రాబోయే కాలంలో పరిస్థితి అంచనా వేసి చూసుకుంటే మున్ముందు తమ తమ బస్తీలలో ప్రజా సమస్యల పరిష్కారం కోరకు స్థానిక మహిళలు,వయోజన ప్రజలు,ప్రత్యేకించి ముస్లిం మహిళలు వారి వద్దకు ఎలా వెళ్ళ గలమని ప్రశ్నిస్తూ అందుకు గాను మాగంటి సునీత గోపినాథ్ బహెన్కే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఆమె విజయం కొరకు తామంతా కారు గుర్తుకు ఓటు వేసి బంధుమిత్రులతో ఓటు వేయించేలా తాము కృషి చేస్తున్నామని ముక్త కంఠంతో తెలియపరచారు. పరిణామంగా కాంగ్రెసు ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నవని సంకేతాలు కనపడు తున్నవని ప్రజలు వారి అభిప్రాయాలను వ్యక్త పరుస్తున్నారు. ఈ పరిస్థితిలో అఖండ మెజారిటీతో గెలువ బోతున్న సమయంలో మణికొండ బిఆర్ఎస్ కార్యకర్తలు కారు గుర్తుకు ఓటు వేయించడానికి తమ వంతు కృషిగా వీధి వీధి తిరుగుతున్నారని,అందులో భాగంగా బూత్ 24 నుండి స్థానికులు జీషాన్ రమేశ్ సంపత్ బిలాల్,సీనియర్ నాయకులు భాను చందర్ బిందూ కుమార్ వెంకటేశ్ సన్నీ,బూత్ 25 లో స్థానికులు రవికుమార్,అశోక్,ఎండి ఫయాజ్,డాన్ శీను, దస్తగిరి ముషీరాబాద్ నాయకులు ఎస్టీ ప్రేమ్, బి.కిరణ్ కుమార్ మణికొండ జనరల్ సెక్రటరీ గుట్టమీద నరేందర్,నాయకులు షేక్ ఆరీఫ్,యాలాల కిరణ్,షకీలా రెడ్డి,26 బూత్ లో స్థానికులు వాసవి స్వప్న పుష్ప,అంకమ్మ,జ్ఞానేశ్వర్ అశోక్ రాధిక పార్టీ సీనియర్లు ప్రభు,సుమనళిని రేఖ,దేవీ ప్రియ,బూత్ 29లోనీ ఫాల్కన్ వ్యాలీ కాలనీ,ఆదిత్య లెగ్రాండియస్,వెటర్నరీ కాలనీ అపర్ణా ఔరా సీనియర్ వ్యాలీలో విస్తృతంగా పర్యటించి ప్రతి ఇంటి ఓటర్లను కలసిన స్థానిక నాయకులు వెంకటేష్ ప్రభాకర్ లతో పాటు పార్టీ మణికొండ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు,కిరణ్ ముషీరాబాద్ గడ్డ మీది శ్రీనివాస్,వెంకటేశ్,బూత్ 30 లో స్థానికులు వెంకటయ్య రవీందర్ మల్లేష్ యదారావు అశోక్, పరమేశ్వర్ మణికొండ నుంచి మాజీ కౌన్సిలర్ ఆలస్యం నవీన్ కుమార్, ముషీరాబాద్ నుంచి మూర్తి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జూబ్లిహిల్స్ ఉపఎన్నికల ప్రచారములో దూసుకెళ్తున్న వనపర్తి శ్రేణులు.



**వనపర్తి :** మాగంటి.సునీత గెలుపుకోసం శ్రమిస్తున్న శ్రేణులు.నిరంజన్ రెడ్డి ఆదేశం మేరకు జూబ్లిహిల్స్ ఉపఎన్నికలో రహ్మత్ నగర్ డివిజన్లో 152బూతు నుండి 160బూతు ఇంచార్జీలుగా ఉంటూ స్థానిక నాయకుల సమన్వయం చేస్తూ ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. 23నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను గుర్తుచేస్తూ ఆరు గ్యారంటీలు అయిన మహిళలకు 2500,ఆసరా పింఛన్లు 4000,ఆటో కార్మికులకు 15000,కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు విద్యార్థులకు విద్యా బరోసా విద్యార్థినులకు స్కూటీలు రైతులకు రైతు భరోసా,రుణ మాఫీ,వంటి పథకాలు ఇవ్వకుండా హరిగోస పెడుతున్నారని వివరించారు.
ప్రజలు కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత మంచినీళ్ళు,కరెంట్ రావడం లేదని రోడ్లు అధ్వానంగా తయారు అయినాయని మళ్ళీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కె.సి.ఆర్ ని గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తుందని మాగంటి.సునీత గెలుపు ఖాయం అని శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ మాజీ మార్కెట్ ఛైర్మెన్ లక్ష్మారెడ్డి,మాజీ జెడ్.పి.టి.సి బోర్ల.భీమయ్య,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,జిల్లా ఎస్.టి.సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్,మండల పార్టీ అధ్యక్షులు కే.మాణిక్యం, ధర్మా నాయక్,మండల యువత అధ్యక్షులు చిట్యాల.రాము,పాతపల్లి.గోవిందు,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి,బొల్లారం.నారాయణ,మాజీ సర్పంచ్ రాధాకృష్ణ,లోకేష్,శంకర్ నాయక్,కృష్ణ నాయక్,జయరాములు,గోవిందు నాయక్,గోపి,బాలరాజు తదితరులు పాల్గొంటున్నారు.

## దేశ ఐక్యతకు ప్రతీకగా "రన్ ఫర్ యూనిటీ 2ఐ రన్" కార్యక్రమం



**వనపర్తి :** సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆలోచనలను స్మరించుకుంటూ, దేశ ఐక్యతకు ప్రతీకగా ప్రతి ఒక్కరూ "రన్ ఫర్ యూనిటీ 2ఐ రన్" లో పాల్గొని జాతీయ ఐక్యతకు అంకితభావాన్ని చాటాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ఐపీఎస్., అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుండి 31వ తేదీ వరకు వనపర్తి జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి జాతీయ ఐక్యత దినోత్సవం (అక్టోబర్ 31 బబి ) ను పురస్కరించుకొని సర్దార్ వల్లభయ్ పటేల్ 150 వ జయంతి సందర్బంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ 2ఐ రన్" ఉదయం 7:00 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుండి ఎకో పార్క్ వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో యువత, ప్రజా ప్రతినిధులు సామాజికవేత్తలు, కవులు కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గోని విజయవంతం చెయ్యాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. "దేశ ఏకత, సమైక్యతకు ప్రతీకైన సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఐక్యతకు ప్రతీకగా 'రన్ ఫర్ యూనిటీ' లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది మరియు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

## జాతీయ ఐక్యత దినోత్సవం సందర్బంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం

**రాజన్న సిరిసిల్ల :** భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నేడు ఉదయం 7:00 గంటలకు జిల్లాలో కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు మరియు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రన్ ఫర్ యూనిటీ, కార్యక్రమంలో భాగంగా రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రన్ లో ప్రజలు,విద్యార్థులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని ఐక్యత,జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంతో పాటుగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించే రన్ ఫర్ యూనీటి కార్యక్రమనికి సంబంధించిన పోస్టర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

## రైతులకు టార్పాలిన్లు కచ్చితంగా అందజేయాలి!

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల :** అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కచ్చితంగా టార్పాలిన్లు అందజేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంఛార్జి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, వడ్ల తేమ శాతం పరిశీలించి, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో రైతులు వరి కోతలు మరో రెండు రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అన్ లోడ్ చేసుకునేలా చూడాలని, సన్నరకం వడ్లను కూడా తీసుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# జామ ఆరోగ్యానికి మంచిదే



జామపండ్లు రుచికి బలేగా ఉంటాయి. వీటిల్లో సోడియం, పొటాషియం, ఫైబర్, ప్రోటీన్, ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. జామ జీర్ణ సమస్యలు, శారీరక బలహీనతను తగ్గిస్తుంది. అదనంగా దాని యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని హానికరమైన కణాల నుంచి రక్షిస్తాయి. జామపండ్లు రుచికి బలేగా ఉంటాయి. వీటిల్లో సోడియం, పొటాషియం, ఫైబర్, ప్రోటీన్, ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. జామ జీర్ణ సమస్యలు, శారీరక బలహీనతను తగ్గిస్తుంది. అదనంగా దాని యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని హానికరమైన కణాల నుంచి రక్షిస్తాయి. జామపండ్లు ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ.. ఇవి కొంతమందికి మేలు కంటే ఎక్కువ హాని కలిగిస్తాయి. కాబట్టి ఇలాంటి వారు జామపండ్లు తినకపోవడమే మంచిది. ముఖ్యంగా అలెర్జీ ఉన్నవారు ఈ పండు తినకూడదు. జామపండు తినడం వల్ల కొంతమందిలో చర్మంపై దద్దుర్లు, దురద, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి అలెర్జీ లక్షణాలు సంభవించవచ్చు. ఇలాంటి వారు అస్సలు తినకూడదు. జామపండు తిన్న తర్వాత మీ శరీరంలో ఏవైనా మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఉబ్బరం, విరేచనాలు, గ్యాస్, గుండెల్లో మంట లేదా అజీర్ణం వంటి జీర్ణ సమస్యలు ఉన్నవారు కూడా జామ తినకూడదు. జామలో విటమిన్ సి, ఫ్రక్టోజ్ అధికంగా ఉంటాయి. ఇది జీర్ణ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుంది. అలాగే జామలోని విత్తనాలు, ఫైబర్ జీర్ణవ్యవస్థపై ఒత్తిడిని కలిగిస్తాయి. జామకు జలుబు స్వభావం ఉంటుంది. అందువల్ల శీతాకాలంలో జామకాయలు అధికంగా తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, జలుబు, దగ్గు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. జామలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది. అయితే ఇప్పటికే రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా ఉన్నవారు జామపండు తినకపోవడం బెటర్. రక్తంలో చక్కెరను తగ్గించే మందులు తీసుకునేవారు కూడా జామ తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ఏదైనా శస్త్రచికిత్స తర్వాత కూడా వెంటనే జామ పండ్లు తినకూడదు. ఎందుకంటే జామకాయను తినడం వల్ల రక్తస్రావం ప్రమాదం పెరుగుతుంది. గాయం మానడం ఆలస్యం అవుతుంది.

# డైట్‌లో షుగర్ ఎక్కువగా ఉందా?





శరీరంలో చక్కెర శాతం ఎక్కువైతే ఎన్ని ప్రమాదాలు వచ్చి పడతాయో అందరికీ తెలిసిందే. శరీరంలో చక్కెర ఎక్కువైతే కాలేయంపై ఎఫెక్ట్ పడుతుంది. శరీరంలో గ్లూకోజ్ పేరుకుపోయి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. చక్కెర ఎక్కువైతే.. అధిక బరువు, కిడ్నీ సమస్యలు, హైబీపీ లాంటివి వచ్చే అవకాశం ఉంది. అందుకే ఎంత షుగర్ తీసుకుంటున్నామో చెక్ చేసుకుంటుండాలి. శరీరంలో చక్కెర ఎక్కువైతే అది కొన్ని సింప్టమ్స్ ద్వారా బయటపడుతుంది. దాన్ని గుర్తించడం ద్వారా మీరు షుగర్ ఇన్ టేక్ ఎక్కువ అయిందని గుర్తించొచ్చు. తద్వారా తగిన జాగ్రత్తలు తీసుకుని షుగర్ లెవల్స్ ను కంట్రోల్ లో ఉంచుకుంటూ డయాబెటిస్ రాకుండా జాగ్రత్తపడొచ్చు. ఎక్కువ చక్కెర తీసుకోవడం వల్ల శరీరంలో గ్లూకోజ్ లెవల్స్ పెరిగి మొటిమలు వస్తుంటాయి. అకస్మాత్తుగా మొటిమలు, విరేచనాలు లాంటివి కనిపిస్తే చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. షుగర్‌తో కూడిన ఆహారం తీసుకుంటే క్యాలరీలు పెరిగి ఆకలి తగ్గుతుంది. అందుకే ఆకలి తగ్గుతున్నప్పుడు స్వీట్స్ లాంటివి ఎక్కువ తింటున్నారేమో చెక్ చేసుకోవాలి. అలాగే షుగర్ ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకుంటే శరీరంలో క్యాలరీలు ఎక్కువ అవుతాయి. ఫలితంగా బరువు పెరుగుతారు. ఉన్నట్టుండి బరువు పెరగుతుంటే దానికి చక్కెర కూడా కారణమవ్వొచ్చు. కాబట్టి షుగర్ ఇన్‌టేక్‌ను ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది. వైట్ షుగర్.. సైటోకిన్‌లను విడుదల చేస్తుంది. అది చిరాకు, అలసటకు దారితీస్తుంది. అందుకే అలాంటి లక్షణాలు కనిపిస్తే చక్కెర ఎక్కువ తింటున్నారేమో చూసుకోవాలి. చక్కెర ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో మెగ్నీషియం లెవల్స్ కూడా తగ్గిపోతాయి. హాయిగా నిద్రపట్టాలంటే మెగ్నీషియం మినరల్ అవసరం. అది లేనప్పుడు నిద్ర సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి స్లీప్ సైకిల్‌లో మార్పులు గమనిస్తే షుగర్ కంటెంట్ ఎక్కువైందేమో చెక్ చేసుకోవాలి. ఇకపోతే చాలామంది లావైపోతామని, షుగర్ వ్యాధి వస్తుందని.. ఇలా రకరకాల కారణాల వల్ల షుగర్‌ను పూర్తిగా అవాయిడ్ చేస్తుంటారు. కానీ శరీరానికి షుగర్ కూడా అవసరమే. అందుకే పండ్లు, పాల ఉత్పత్తుల లాంటివి తీసుకోవాలి. వాటిద్వారా శరీరానికి సహజ చక్కెరలు అందుతాయి. వీటితో ఎలాంటి నష్టం ఉండదు.

# ఓట్స్‌తో లెక్కలేనన్ని ప్రయోజనాలు




ఈ మధ్య కాలంలో జనాలు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. ఇందుకోసం జిమ్‌కు వెళ్లడం, డైట్స్ ఫాలో అవ్వడం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్యకరమైన ఆహారం కోసం చూస్తున్నారు. ఇలాంటి వారికి ఓట్స్ గొప్ప ఎంపిక అని వైద్య నిపుణులు చెబుతున్నారు. వీటిని మన రోజూవారి ఆహారంలో చేర్చుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు.ఓట్స్‌ను ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ ఆహారాలలో ఒకటిగా పరిగణిస్తారు. ఎందుకంటే వీటిలో అవసరమైన పోషకాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్ల పుష్కలంగా ఉంటాయి. ఇది ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, మొత్తం ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. ఓట్ మీల్ నుండి స్మూతీస్ నుండి రాత్రి భోజనం వరకు, వీటిని మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వివిధ మార్గాల్లో చేర్చవచ్చు. ప్రతిరోజూ మీ బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్‌ను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బరువును నియంత్రిస్తుంది: ఓట్స్‌లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఉదయం ఓట్స్ తినడం వల్ల ఆకలిని అదుపులో ఉంచుతుంది అలాగే అనారోగ్యకరమైన స్నాక్స్ తినకుండా నిరోధిస్తుంది. గుండె ఆరోగ్యం: ఓట్స్ ను క్రమం తప్పకుండా తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఓట్స్ లోని బీటా–గ్లూకాన్ పేగుల్లో జెల్ లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తుంది ఇది కొలెస్ట్రాల్‌తో బంధిస్తుంది. ఇది శరీరం నుండి కొలెస్ట్రాల్ ను తొలగించడంలో సహాయపడుతుంది అలాగే ఆరోగ్యకరమైన గుండెను నిర్వహిస్తుంది. శాశ్వత శక్తి: ఓట్స్ నెమ్మదిగా జీర్ణమయ్యే కార్బోహైడ్రేట్ కాబట్టి, రోజంతా శక్తి క్రమంగా విడుదల అవుతుంది, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి, నిరంతర శక్తి వనరులను అందించడానికి సహాయపడుతుంది.జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: ఓట్స్‌లో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది అలాగే మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఓట్స్‌తో మీ రోజును ప్రారంభించడం వల్ల మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: ఓట్స్ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వలన, ఇవి డయాబెటిస్ ఉన్నవారికి అనుకూలంగా ఉంటాయి. ఓట్స్‌లో ఉండే కరిగే ఫైబర్ రక్తంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తుంది, భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది. మెదడు పనితీరు: ఓట్స్‌లో బి విటమిన్లు, ఐరన్ , మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి, ఇవి మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల శ్రద్ధ, జ్ఞాపకశక్తి మరియు మొత్తం అభిజ్ఞా పనితీరు మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి: ఓట్స్‌లోని బీటా–గ్లూకాన్ తెల్ల రక్త కణాలు ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా త్వరగా స్పందించేలా చేయడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మీరు ప్రతిరోజూ ఉదయం ఒక గిన్నె ఓట్స్ తినడం ద్వారా మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవచ్చు.

# ఈ డైట్ ఫాలో అయితే 120 ఏళ్లు బతకొచ్చట?



వీగన్ డైట్ అని, కీటో డైట్ అని.. ప్రస్తుతం చాలారకాల డైట్‌లు పాపులర్ అవుతున్నాయి. అయితే వీటన్నింటినీ తలదన్నే డైట్ ఒకటుంది. అదే 'లాంజెవిటీ డైట్'. వాల్టర్ లాంగో అనే అమెరికన్ బయాలజిస్ట్ రూపొందించిన ఈ డైట్ ఫాలో అయితే ఏకంగా 120 ఏండ్లు జీవించే అవకాశం ఉంటుందట. లాంజెవిటీ అంటే 'దీర్ఘాయువు' అని అర్థం. అంటే ఈ డైట్.. ఎక్కువకాలం జీవించడం కోసం డిజైన్ చేశారన్న మాట. అయితే ఈ డైట్ ప్రత్యేకంగా వయసుపై బడిన వాళ్ల కోసం రూపొందించినట్టు వాల్టర్ లాంగో చెప్తున్నాడు. ఈ డైట్ లో ఎక్కువ ఆకుకూరలు, తక్కువ ప్రొటీన్స్, ఉపవాసం.. అనే మూడు ముఖ్యమైన రూల్స్ ఉంటాయి. ఈ డైట్ శరీరం ఏజింగ్ ప్రాసెస్‌ను స్లో చేసి ఎక్కువకాలం జీవించేలా చేస్తుందట. ఇంతకీ ఈ డైట్ లో ఏమేం తినాలంటే..ఈ డైట్ లో ఆకుకూరలు, ఫ్రూట్స్, బీన్స్, నట్స్, ఆలివ్ నూనె, సీ ఫుడ్ లాంటివి తినాలి. మాంసం, పాల ఉత్పత్తులు చాలా తక్కువగా తీసుకోవాలి. అలాగే ఫ్యాట్స్, షుగర్స్‌ను తీసుకోకూడదు. ఈ డైట్‌లో బరువుని బట్టి ప్రొటీన్లు తీసుకోవాలి. ఒక రోజులో ఒక కిలో బరువుకు 0.68 నుంచి 0.80 గ్రాముల కంటే ఎక్కువ ప్రొటీన్ తీసుకోకూడదు. ఉదాహరణకు ఒక వ్యక్తి 60 కిలోల బరువుంటే.. రోజుకు 40.8 నుంచి 48 గ్రాములకు మించి ప్రొటీన్లు తీసుకోకూడదు. ఈ డైట్‌లో మరో రూల్ ఏంటంటే.. ఆహారాన్ని విడతల వారీగా తీసుకోవాలి. రోజులో తీసుకునే మొత్తం ఆహారాన్ని కేవలం 12 గంటల్లోనే తినాలి. ఉదాహరణకు ఉదయం 7 గంటలకు మొదటి మీల్ తీసుకుంటే సాయంత్రం 7 గంటల లోపు రెండు లేదా మూడవ మీల్ తినేయాలి. అలా 12 గంటల్లోపు తినేలా ప్లాన్ చేసుకోవాలి. మిగతా టైం అంతా ఉపవాసం ఉండాలి. ఇకపోతే ఈ డైట్ లో భోజనానికి నిద్రకు మధ్య కనీసం నాలుగు గంటల గ్యాప్ ఉండాలి. అలాగే వారంలో రెండు రోజులు మాత్రం రెండు వేల కంటే తక్కువ క్యాలరీలుండే ఆహారాన్ని తీసుకోవాలి. ఈ డైట్‌లో ఉడికించిన, గ్రిల్ చేసిన ఆహారాన్ని కూడా తీసుకోవచ్చు. బేకింగ్ ఫుడ్స్, వేగించిన ఫుడ్ తినకూడదు. విటమిన్, మినరల్ సప్లిమెంట్లు లేదా ఇతర మందులు వాడుతున్నవాళ్లు వాటిని కంటిన్యూ చేయొచ్చు. ఈ డైట్‌ను పాటించడం వల్ల రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. టైప్2 డయాబెటిస్, ఒబెసిటీ, గుండె సమస్యల ప్రమాదం తగ్గుతుంది. ఇవన్నీ ఎక్కువ కాలం జీవించేందుకు సాయం చేస్తాయని లాంగో చెప్తున్నారు.

# చేతుల్లోనే లివర్ భవిష్యత్..



శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, జీవక్రియలో కీలక పాత్ర పోషించే కాలేయం ఆరోగ్యంగా లేదని సూచించే హెచ్చరిక సంకేతాలు కొన్నిసార్లు మన చేతుల్లోనే కనిపిస్తాయి. ఫ్యాటీ లివర్ లేదా సిర్రోసిస్ వంటి తీవ్ర సమస్యలను నివారించడానికి ఈ లక్షణాలను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో కాలేయం ఒకటి. ఇది శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, జీవక్రియ, జీర్ణక్రియ, హార్మోన్ల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. కాలేయానికి ఏదైనా నష్టం జరిగినా లేదా అది సరిగా పనిచేయడం ఆగిపోయినా, దానికి సంబంధించిన తొలి హెచ్చరిక సంకేతాలు కొన్నిసార్లు మన చేతుల్లోనే కనిపిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ లక్షణాలను ముందుగానే గుర్తించడం ద్వారా ఫ్యాటీ లివర్, హెపటైటిస్ లేదా సిర్రోసిస్ వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. ఇతర లక్షణాలు బయటపడకముందే.. చేతుల్లోని ఈ మార్పులు మీ కాలేయం ఆరోగ్యంగా లేదని సూచిస్తాయి. క్లినికల్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ హెపటాలజీ జర్నల్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. చర్మం, గోళ్లపై కనిపించే ఈ మార్పులు దీర్ఘకాలిక కాలేయ వ్యాధితో ముడిపడి ఉంటాయి. చేతి అరచేతులు, ముఖ్యంగా బొటనవేలు, చిటికెన వేలు కింద భాగం ఎరుపు రంగులోకి మారతాయి. కాలేయం సరిగా పనిచేయకపోవడం వలన ఈస్ట్రోజెన్ స్థాయిలు పెరిగి, చేతుల్లోని రక్తనాళాలు ఉబ్బడానికి దారితీస్తుంది. ఆరోగ్యకరమైన వ్యక్తులలో కూడా ఇది కనిపించినప్పటికీ, పెద్దవారిలో కాలేయ సమస్యలను సూచించవచ్చు. అరచేతిలోని చర్మం కింద కండరాలు గట్టిపడి, వేళ్లు లోపలికి వంగిపోతాయి. ఇది ముఖ్యంగా సిర్రోసిస్ వంటి దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు ఉన్నవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది చేతి కదలికను పరిమితం చేస్తుంది. గోళ్ల చివర్లు తెల్లగా ఉండి, ఆ చివరన సన్నటి గులాబీ రంగు గీత కనిపిస్తుంది. ఈ లక్షణం కాలేయ సిర్రోసిస్‌ను సూచించవచ్చు. గోళ్ల కింద రక్త ప్రవాహం, ప్రోటీన్ స్థాయిలలో మార్పుల వల్ల ఇది సంభవిస్తుంది. చేతి వేళ్ల చివరలు, గోళ్లు గుండ్రంగా, వెడల్పుగా ఉబ్బినట్లు కనిపిస్తాయి. ఇది దీర్ఘకాలిక కాలేయ వ్యాధుల సంబంధం కలిగి ఉన్నప్పటికీ, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం వలన కూడా సంభవించవచ్చు. చేతులు, మణికట్టుపై అసంకల్పితంగా, లయబద్ధంగా వణుకు వస్తుంది. కాలేయ వ్యాధి తీవ్రమై, విషపదార్థాలు మెదడును ప్రభావితం చేస్తున్నాయని ఇది సూచిస్తుంది. అరచేతులు, అరికాళ్లలో విపరీతమైన దురద ఉంటుంది. కాలేయం నుంచి పిత్తం బయటకు రాకుండా ఆగిపోవడం వల్ల పిత్త లవణాలు చర్మం కింద పేరుకుపోవడం దీనికి కారణం.

# బిజినెస్

## శాంసంగ్ డిజిటల్ కీ.. ఇకపై ఫోన్‌తోనే కారు అన్ లాక్



ప్రముఖ మొబైల్ ఫోన్ తయారీ సంస్థ కీలక ఫీచర్ తీసుకువచ్చింది. శాంసంగ్ గెలాక్సీ మొబైల్స్ లో కార్ అన్‌లాకింగ్ ఫీచర్ తీసుకువచ్చింది. ఈ ఫీచర్ ద్వారా ఫిజికల్ కీ లేకుండా ఫోన్‌తోనే కారును స్టార్ట్ చేయడం, అన్ లాక్ చేయడం లాంటివి చేయవచ్చు. అయితే ప్రస్తుతం ఇది మహీంద్రా ఎలక్ట్రికల్ ఎస్‌యూవీ వాహనాలకు మాత్రమే పనిచేస్తుంది. అంతే కాకుండా డిజిటల్ కార్ కీ పేరుతో గెలాక్సీ ఫోన్లలో ఈ ఫీచర్ అందుబాటులోకి తీసుకువస్తోంది. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్, అల్ట్రా వైడ్ బ్యాండ్, టెక్నాలజీల సాయంతో ఇది పనిచేస్తుంది. కార్ మోడల్ ఆధారంగా డిజిటల్ కీ అనుసంధానం అవుతుంది. అంతే కాకుండా ఒకసారి ఫోన్ లోని యాప్ తో పెయిర్ చేసిన తరవాత యూజర్ ఫోన్ ను కారుకు దగ్గరగా తీసుకెళ్లగానే ఆటోమెటిక్‌గా అన్ లాక్ అవుతుంది. డిజిటల్ కీ యాప్ ద్వారా ఇతరులకు సైతం కారు యాక్సెస్ ఇచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే లేదా మర్చిపోతే శాంసంగ్ ఫైండ్ సర్వీసెస్ ద్వారా రిమోట్ గా కీ ని లాక్ చేయవచ్చు, లేదంటే పూర్తిగా తొలగించవచ్చు.

## ఫేస్‌బుక్, లింక్డ్ఇన్ తరహాలో తవాట్సాప్‌లోనూ కవర్ ఫోటో ఫీచర్




ప్రముఖ మేసేజింగ్ యాప్ వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చే పనిలో ఉంది. సాధారణంగా ప్రొఫైల్, కవర్ ఫోటోలు సోషల్ నెట్‌వర్కింగ్ అకౌంట్ల తీరులో కీలక పాత్ర పోషిస్తాయి.దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫేస్‌బుక్, లింక్డ్ఇన్ తరహాలో కవర్‌ఫోటో ఫీచర్ అందించడానికి సన్నాహాలు చేస్తోంది. కవర్ ఫోటోలు ఇప్పటివరకు వాట్సాప్ బిజినెస్ అకౌంట్లకు మాత్రమే ఉన్నాయి, దీన్ని ఇప్పుడు అందరికీ అందుబాటులోకి తెచ్చే చర్యలు తీసుకుంటున్నట్టు వాట్సాప్ తెలిపింది. ప్రొఫైల్ కస్టమైజేషన్‌లో భాగంగా ఈ సదుపాయాన్ని సాధారణ కస్టమర్లకు కూడా అందించాలని భావిస్తున్నట్టు వాట్సాప్ పేర్కొంది. ప్రస్తుతం ఈ ప్రక్రియను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో కస్టమర్లకు అందిస్తామని స్పష్టం చేసింది. అయితే, ఎప్పటికీ అందుబాటులోకి వస్తుందనే విషయం వాట్సాప్ చెప్పలేదు. భవిష్యత్తులో వాట్సాప్ అప్‌డేట్‌లో దీన్ని తీసుకొస్తామని, కొత్త ఫీచర్‌ను ఉపయోగించి కస్టమర్లు తమ ప్రొఫైల్ సెట్టింగ్స్ ద్వారా నచ్చిన ఫోటోను కవర్ ఫోటోగా పెట్టుకోవచ్చని వాట్సాప్ తన బ్లాగ్ పోస్ట్‌లో వివరించింది. దీనికి ప్రత్యేకమైన ప్రైవసీ సెట్టింగ్ కూడా ఉంటుందని, కవర్ ఫోటోను ఎవరు చూడాలనే ఆప్షన్ కూడా ఇవ్వనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ప్రొఫైల్ ఫోటోకు ఉన్నట్టుగానే మై కాంటాక్ట్స్, ఎవ్రీవన్, నోబడీ లాంటి ఎంపికలుంటాయి.

# ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ‘లేఆఫ్స్’ కలకలం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మరియు కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికత వేగవంతం కావడంతో, బహుళజాతి కంపెనీలు ఉద్యోగుల తొలగింపులను (లేఆఫ్స్) భారీగా ప్రకటిస్తున్నాయి. కేవలం కొన్ని నెలల్లోనే లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. ముఖ్యంగా, యూపీఎస్‌లో 48,000, అమెజాన్‌లో 30,000, ఇంటెల్‌లో 24,000, మరియు నెస్లేలో 16,000 వంటి భారీ సంఖ్యలో ఉద్యోగాల కోతలు జరిగాయి. వీటితో పాటు, యాక్సెంచర్, ఫోర్డ్ వంటి కంపెనీలు కూడా ఒక్కొక్కటి 11,000 చొప్పున ఉద్యోగులను తొలగించాయి. ఈ గణాంకాలు ప్రపంచ కార్మిక మార్కెట్‌లో నెలకొన్న అస్థిరతకు అద్దం పడుతున్నాయి. పెద్ద సంఖ్యలో లేఆఫ్స్ ప్రకటించిన జాబితాలో ఇతర టెక్, ఫార్మా మరియు కన్సల్టింగ్ దిగ్గజాలు కూడా ఉన్నాయి. మైక్రోసాఫ్ట్‌లో 7,000, పీడబ్ల్యూసీలో 5,600, సేల్స్‌ఫోర్స్‌లో 4,000 మరియు ఫార్మా దిగ్గజం నోవో నార్డిస్క్‌లో 9,000 ఉద్యోగాల కోతలు నమోదయ్యాయి. ఈ తొలగింపులు కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా, లాజిస్టిక్స్, టెక్నాలజీ, ఆహార పరిశ్రమ, ఆటోమొబైల్ మరియు కన్సల్టింగ్ వంటి వివిధ కీలక రంగాలకు విస్తరించాయి. దీని ద్వారా, ఆర్థిక మాంద్యం భయాలు, పెరుగుతున్న నిర్వహణా ఖర్చులు, మరియు వ్యయ నియంత్రణ చర్యలు కంపెనీల వ్యూహంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని స్పష్టమవుతోంది. ఈ సామూహిక లేఆఫ్స్‌కు అనేక కారణాలు దోహదపడుతున్నాయి. కోవిడ్-19 మహమ్మారి సమయంలో అధిక లాభాలు మరియు డిమాండ్‌ను అంచనా వేసి, అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే




ప్రధానంగా కనిపిస్తుంది. అయితే, ప్రస్తుతం ఆర్థిక వృద్ధి మందగించడం, రుణాలపై వడ్డీ రేట్లు పెరగడం వంటి స్థూల ఆర్థిక ఒత్తిళ్లు కంపెనీల లాభాలపై ప్రభావం చూపుతున్నాయి. వీటికి తోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల అనేక మానవ వనరుల పనులను యంత్రాలు భర్తీ చేయగలుగుతున్నాయి. ఫలితంగా, కంపెనీలు తమ వ్యాపార నమూనాలను "లీన్"గా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి, ఇందులో భాగంగానే అనవసరమైన లేదా పునరావృతమయ్యే పాత్రలను తొలగిస్తున్నాయి. ఈ లేఆఫ్స్ కేవలం ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాది మంది జీవితాలపైనే కాక, మొత్తంగా కార్మిక మార్కెట్ మరియు ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకవైపు, అనుభవం ఉన్న నిపుణులు సైతం కొత్త ఉద్యోగాల కోసం తీవ్రంగా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## కృత్రిమ మేధ చిప్‌లకు భారీ డిమాండ్‌తో కంపెనీ దూకుడు

కృత్రిమ మేధ రంగంలో ప్రభంజనం సృష్టిస్తున్న చిప్‌మేకర్ ఎన్విడియా కార్పొరేషన్ చరిత్ర సృష్టించింది. బుధవారం ట్రేడింగ్‌లో కంపెనీ మార్కెట్ విలువ తొలిసారిగా 5 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించింది.మార్కెట్ ప్రారంభంలోనే కంపెనీ షేర్లు 3 శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐకి పెరుగుతున్న డిమాండ్‌తో అత్యధికంగా లాభపడిన సంస్థగా ఎన్విడియా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. 5 శాతం పెరిగిన ఈ కంపెనీ షేర్లు, బుధవారం కూడా అదే జోరును కొనసాగించాయి. ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌తో సమావేశం కానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీకి ముందు, ఎన్విడియా బ్లాక్‌వెల్ ఏఐ ప్రాసెసర్లపై చర్చించేందుకు ఈ సమావేశం జరగనుంది. ఈ ప్రకటనతో, కంపెనీకి అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన చైనాకు చిప్‌ల అమ్మకాలపై ఉన్న ఆంక్షలు సడలించే అవకాశం ఉందన్న అంచనాలు పెరిగాయి.కేవలం నాలుగు నెలల క్రితమే 4 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన ఎన్విడియా, ఇంత తక్కువ సమయంలోనే 5 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరడం విశేషం. ఏఐ ప్రాసెసర్లకు రికార్డు స్థాయిలో ఉన్న డిమాండ్, వరుసగా కుదుర్చుకుంటున్న భాగస్వామ్యాలు కంపెనీ అసాధారణ వృద్ధికి కారణంగా నిలుస్తున్నాయి. ఇటీవల సీఈఓ జెన్సన్ హువాంగ్ మాట్లాడుతూ.. తమకు 500 బిలియన్ డాలర్ల విలువైన కొత్త చిప్ ఆర్డర్లు వచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, రోబోట్యాక్సీల అభివృద్ధి కోసం ఉబర్‌తో, 6జీ టెక్నాలజీ కోసం నోకియాలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడి, తర్వాతి తరం చాట్‌జీపీటీ కోసం కొత్త ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు ఓపెన్‌ఏఐతో 100 బిలియన్ డాలర్ల ఒప్పందం వంటి కీలక భాగస్వామ్యాలను ప్రకటించింది.




మరో కీలక ఒప్పందంలో భాగంగా, అమెరికా ఇంధన శాఖతో కలిసి ఏడు ఏఐ సూపర్ కంప్యూటర్లను నిర్మించడానికి ఎన్విడియా పనిచేస్తోంది. ఇది హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ రంగంలో కంపెనీ నాయకత్వాన్ని మరింత సుస్థిరం చేస్తోంది.

# కుదిరితే పదకొండో స్థానంలో కూడా ఆడిస్తారు: బీసీసీఐపై మాజీ క్రికెటర్ విమర్శలు

టీ20 ప్రపంచకప్-2024 తర్వాత టీమిండియా ఓపెనర్‌గా వచ్చి అదరగొట్టాడు సంజూ శాంసన్ పదమూడు ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా వచ్చి 183కు పైగా స్ట్రైక్‌రేటుతో పరుగులు రాబట్టాడు. ఇందులో ఏకంగా మూడు శతకాలు కూడా ఉండటం గమనార్హం.

### గిల్ రాకతో గందరగోళం

అయితే, ఆసియా టీ20 కప్-2025 సందర్భంగా శుబ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా రీ ఎంట్రీ ఇవ్వడంతో సంజూకు కష్టాలు మొదలయ్యాయి. భవిష్య కెప్టెన్ గిల్ ఓపెనర్‌గా వచ్చేందుకు సంజూపై వేటు వేసింది యాజమాన్యం. ఇక ఆ టోర్నీలో సంజూకంటూ బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రత్యేక స్థానం లేకుండా పోయింది. ఆసియా కప్ టోర్నీలో మూడుసార్లు ఐదో స్థానంలో.. ఓసారి ఆరో స్థానంలో సంజూను బ్యాటింగ్‌కు పంపారు. ఇక బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనైతే ఎనిమిదో స్థానం వరకు అతడికి పిలుపేరాలేదు. వికెట్ కీపర్‌గా మాత్రమే టోర్నీ ఆసాంతం అతడి సేవలు వాడుకున్నారు. తాజాగా ఆస్ట్రేలియా పర్యటనలోనూ తొలి టీ20లో శుబ్‌మన్ గిల్- అభిషేక్ శర్మతో కలిసి భారత ఇన్నింగ్స్ ఆరంభించాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కెప్టెన్, మాజీ చీఫ్ సెలక్టర్ క్రిష్ణమాచారి



శ్రీకాంత్ సంజూ శాంసన్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు.

### దురదృష్టవంతుడైన ఆటగాడు

యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడుతూ.. "జట్టులో ప్రస్తుతం అత్యంత దురదృష్టవంతుడైన ఆటగాడు సంజూ శాంసన్. ఓపెనర్‌గా సెంచరీ చేసిన ఘనత అతడిది. కానీ ఇప్పుడు 3-8 వరకు ఏ స్థానంలోనైనా మేనేజ్‌మెంట్ అతడిని పంపేందుకు వెనుకాడటం లేదు.

### కుదిరితే పదకొండో స్థానంలో కూడా ఆడిస్తారు

ఒకవేళ అవకాశం గనుక ఉంటే.. పదకొండో స్థానంలో కూడా సంజూను బ్యాటింగ్ చేయమంటారు. ఇలా చేయడం వల్ల ఆటగాడి మనసు గాయపడుతుంది. టాపార్డర్‌లో రాణించినా డిమోట్ చేయడం ఎంతమాత్రం సరికాదు. అయినా.. ఇప్పుడు అతడికి ఇంతకంటే గొప్ప ఆప్షన్ మరొకటి లేదు.

### వికెట్ కీపర్‌గానైనా అవకాశం

మౌనంగా అన్నీ భరిస్తూనే యాజమాన్యం చెప్పినట్లు నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, ఆసియాకప్ టోర్నీలో ఐదో స్థానంలో వచ్చి అతడు మెరుగ్గా రాణించాడు. టీ20 ప్రపంచకప్ టోర్నీలో అతడు మొదటి ప్రాధాన్య వికెట్ కీపర్‌గా ఉంటే అంతకంటే మంచి విషయం మరొకటి ఉండదు. ఐదో నంబర్‌లో సంజూ మరింత మెరుగ్గా రాణిస్తే జట్టులో అతడి స్థానానికి ఢోకా ఉండదు. కాగా ఆసియా కప్‌లో సంజూ ఏడు మ్యాచ్‌లలో కలిపి 125 కంటే తక్కువ స్ట్రైక్‌రేటు నమోదు చేశాడు. అయితే, పాకిస్తాన్‌తో ఫైనల్లో 21 బంతుల్లో 24 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇదిలా ఉంటే ఆసీస్- భారత్ మధ్య తొలి టీ20 వర్షం కారణంగా రద్దై పోయింది.

## స్మృతి మంధాన పెళ్లి డేట్ ఫిక్స్!.. వరుడు ఎవరంటే?

భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతోందా? అంటే అవుననే సమాధానమే ఎక్కువగా వినిపిస్తోంది. వచ్చే నెలలోనే ఈ స్టైలిష్ ఓపెనర్ వివాహ బంధంలో అడుగుపెట్టేందుకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. మహిళా క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్మృతి.. ఇప్పటికే ఎన్నో రికార్డులు సాధించింది.

### భారత జట్టు ఓపెనర్‌గా

భారత జట్టు ఓపెనర్‌గా ఇప్పటికే వన్డేల్లో 115 మ్యాచ్‌లు ఆడి.. 14 శతకాల సాయంతో 5253 పరుగులు సాధించిన స్మృతి.. ఏడు టెస్టుల్లో 629 పరుగులు చేసింది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో 153 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. 3982 పరుగులు సాధించింది. అంతేకాదు.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఫ్రాంఛైజీకి తొలి టైటిల్ అందించిన ఘనత ఆమెది.

ఆరేళ్లుగా ప్రేమ

ప్రస్తుతం వన్డే వరల్డ్‌కప్-2025తో బిజీగా ఉన్న స్మృతి మంధాన.. ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఆమె పెళ్లి పనుల్లో తలమునకలు కానున్నట్లు సమాచారం. కాగా స్మృతి చాన్నాళ్లుగా.. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ తో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. 2019 నుంచి డేటింగ్ చేస్తున్న ఈ జంట గతేడాది తమ ఐదో వార్షికోత్సవం అంటూ రిలేషన్‌షిప్ గురించి అభిమానులతో పంచుకున్నారు.



ఇండోర్ కోడలు కాబోతోంది

ఆ తర్వాత ప్రతి వేడుకలోనూ కలిసి కనిపించారు స్మృతి- పలాష్. స్మృతితో పాటు టీమిండియా టూర్లకు కూడా వెళ్తుంటాడు పలాష్. ఇటీవల.. "స్మృతి త్వరలోనే ఇండోర్ కోడలు కాబోతోంది" అంటూ పలాష్ తమ పెళ్లి గురించి సంకేతాలు ఇచ్చాడు. కాగా 1996లో ముంబైలో జన్మించిన స్మృతి మంధాన.. తనకు రెండేళ్ల వయసు ఉన్నపుడు సాంగ్లీకి వెళ్లింది. మాధవ్‌నగర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసింది. మరోవైపు.. పలాష్ 1995లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఓ మరాఠీ కుటుంబంలో జన్మించాడు. శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకున్న అతడు.. బాలీవుడ్‌లో కంపోజర్‌గా సిర్థపడ్డాడు. పలాష్ సోదరి పాలక్ ముచ్చల్ కూడా బాలీవుడ్ సింగర్. తనకు కూడా స్మృతితో మంచి అనుబంధం ఉందని పాలక్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపింది.

### పెళ్లి డేట్ ఫిక్స్!

ఇక స్మృతి స్వస్థలం సాంగ్లీలోనే పెళ్లి జరుగనున్నట్లు తెలుస్తోంది. టైమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపిన వివరాల ప్రకారం.. నవంబరు 20న స్మృతి- పలాష్ పెళ్లి తంతు జరుగనున్నట్లు తెలుస్తోంది.

# స్పోర్ట్స్

## ఆ జట్టు హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్!?



ఐపీఎల్-2025 సీజన్‌కు ముందు తమ కోచింగ్ స్టాప్‌లో సమూల మార్పులు చేసేందుకు సిద్ధమైంది. మొన్నకు మొన్న మెంటార్ జహీర్ ఖాన్‌పై వేటు వేసిన లక్నో యాజమాన్యం.. ఇప్పుడు హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌ను తప్పించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆండీ ఫ్లవర్ తర్వాత లక్నో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన లాంగర్.. భారత ఆటగాళ్లతో సరైన బంధాన్ని ఏర్పరచుకోలేకపోయారని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో భారత్‌కు చెందిన మాజీ క్రికెటర్‌ను తమ హెడ్ కోచ్‌గా నియమించాలని లక్నో భావిస్తున్నట్లు సమాచారం. ఇన్‌సైడ్ స్పోర్ట్ కథనం ప్రకారం.. లక్నో ఫ్రాంచైజీ మెనేజ్‌మెంట్ తమ జట్టు ప్రధాన కోచ్‌గా భారత క్రికెట్ దిగ్గజం, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను తీసుకురావాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుందంట. యువరాజ్ సింగ్‌తో ఫ్రాంచైజీ యాజమాన్యం ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. యువీ ఇప్పటివరకు ఏ ప్రొఫెషనల్ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేయకపోయినా.. అబుదాబి టి10 లీగ్‌లో మాత్రం మెంటార్‌గా వ్యవహరించాడు. అయితే పంజాబ్‌కు చెందిన ఎంతో మంది యువ ఆటగాళ్లను మాత్రం తన అనుభవంతో యువీ తీర్చిదిద్దాడు. ప్రస్తుత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రియాన్ష్ ఆర్య వంటి సంచలన ప్లేయర్లు యువరాజ్ శిష్యులే. ఒకవేళ యువరాజ్ నిజంగా కోచ్‌గా వస్తే లక్నో తలరాత మారినట్లే.ఇక ఇది ఇలా ఉండగా.. లక్నో సూపర్ జెయింట్స్ ఇటీవల కొన్ని కొత్త నియమాకాలు చేపట్టింది. న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ వ్యూహాత్మక సలహాదారుగా బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్, స్పిన్ బౌలింగ్ కోచ్‌గా కార్ల్ క్రోవ్ లక్నో జట్టులోకి చేరారు. కాగా గత సీజన్‌లో పంత్ సారథ్యంలోని లక్నో జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరడంలో విఫలమైంది.




## అనుకున్నదొక్కటి, అయినదొక్కటి.. దేవుడికి వేరే ప్లాన్స్ ఉన్నాయంటూ శిరీష్ పోస్ట్

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో ఒకరైన అల్లు శిరీష్ కొత్త అడుగు వేయబోతున్నారు. ఆయన తన ప్రియురాలు నైనికాతో నిశ్చితార్థం చేసుకోబోతున్నట్టు ఇటీవల ప్రకటించడంతో మెగా అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. అయితే, ఈ వేడుకకు వాతావరణం ఆటంకం కలిగించింది. దీంతో అల్లు శిరీష్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ షేర్ చేస్తూ .."చలికాలంలో అవుట్‌డోర్ నిశ్చితార్థం ప్లాన్ చేశాను కానీ వాతావరణం, దేవుడికి వేరే ప్లాన్స్ ఉన్నాయ్" అని రాశారు. వర్షంలో డెకరేషన్ వర్క్స్ జరుగుతున్న ఫోటోను షేర్ చేయడంతో ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అక్టోబర్ 31న హైదరాబాద్‌లోని తమ సొంతింట్లోనే నిశ్చితార్థం ప్లాన్ చేశారు.. మొదట అవుట్‌డోర్‌లో, గ్రాండ్‌గా డెకరేషన్ చేసి, వెన్నెల వెలుతురులో స్టేజ్ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేశారు. కానీ తుఫాన్ ప్రభావంతో నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ ఏర్పాట్లు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వాతావరణం మెరుగుపడితే ఔట్‌డోర్‌లోనే వేడుక నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, వర్షం కొనసాగితే సింపుల్‌గా ఇంట్లోనే కుటుంబ సభ్యుల మధ్య నిశ్చితార్థం జరగనుందని సమాచారం. ఈ వేడుకకు కేవలం అల్లు అర్జున్, స్నేహా రెడ్డి కుటుంబం, అలాగే నైనికా కుటుంబ సభ్యులు మాత్రమే హాజరుకానున్నారు. అల్లు శిరీష్ ఇటీవల నైనికా పేరును ప్రకటించినా, ఆమె ఫేస్‌ను రివీల్ చేయలేదు. అయితే దీపావళి సందర్భంగా జరిగిన కుటుంబ వేడుక ఫోటోల్లో అల్లు అర్జున్ భార్య స్నేహా అనుకోకుండా నైనికా ఫేస్ రివీల్ చేయడంతో సోషల్ మీడియాలో ఆమె ఫోటోలు వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకొని స్నేహా రెడ్డి ఆ తర్వాత ఫొటో డిలీట్ చేసినప్పటికీ అప్పటికే కొందరు స్క్రీన్ షాట్ తీసి నెట్టింట వైరల్ చేశారు. జంట మూడముచ్చటగా ఉందని చాలా మంది కామెంట్స్ చేశారు.

## నన్ను చూసి నేనే గర్వపడుతున్నా..



ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి అతి తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. ప్రజెంట్ ఈ బ్యూటీ లేడీ ఓరియెంటెండ్ చిత్రాలతో పాటు పలు క్రేజీయెస్ట్ ప్రాజెక్టులు ఒప్పుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా వచ్చిన 'బైసన్' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇందులో అనుపమ పాత్ర తక్కువగానే ఉన్నప్పటికీ సినిమా హిట్‌లో కీలకంగా మారింది. దీంతో అనుపమపై ప్రశంసలు కురిపిస్తున్నారు ప్రేక్షకులు. ఇందులో భాగంగానే తాజాగా సినిమా సక్సెస్ ఈవెంట్‌లో పాల్గొని కెరీర్ స్టార్టింగ్‌లో ఎదుర్కొన్న విమర్శల గురించి చెప్పుకొచ్చింది. 'నా సినిమా కెరీర్ స్టార్టింగ్‌లో ఎన్నో ట్రోల్స్ ఎదురుకొన్నాను. ముఖ్యంగా నా మొదటి చిత్రం 'ప్రేమమ్' తర్వాత నాపై వచ్చిన నెగిటివిటీకి చాలా భయపడ్డాను.

## మాస్ నిర్ణయానికి థాంక్స్ చెప్పాలి



ఈ మధ్య బడ్జెట్ తో సంబంధం లేకుండా అవకాశం ఉంటే చాలు టికెట్ రేట్లు పెంచుకోవడాన్ని నిర్మాతలు బాగా వాడుకుంటున్నారు. అయితే దీనివల్ల లాభం కన్నా నష్టాలు పొందిన వాళ్లే ఎక్కువ. ధరలు అధికంగా ఉన్న కారణంగా యావరేజ్ లు ఫ్లాప్ కావడం, ఫ్లాపులకు డిజాస్టర్ ముద్ర పడటం పరిపాటిగా మారింది. మిరాయ్ కు ఎలాంటి పెంపు లేకుండా రెగ్యులర్ ప్రైసింగ్ పెట్టినా సరే నూటా యాభై కోట్ల గ్రాస్ దాటేసి వావ్ అనిపించింది. కేవలం రేట్ల కారణంగా హిట్ 3 ది థర్డ్ కేస్, తండేల్ లాంటివి తమ పూర్తి పొటెన్షియాలిటీని వాడుకోలేకపోయాయి. ఇక మాస్ జాతరకు కూడా ఇలాగే చేస్తారేమో అనుకున్నారందరూ. కానీ సితార ఎంటర్‌టైన్మెంట్స్ పెంపుకు వెళ్ళలేదు. హైదరాబాద్ లో ఎలాగూ అనుమతిలో ఉన్న గరిష్ట ధర సరిపోతుంది కాబట్టి ఇబ్బంది లేదు. మల్టీప్లెక్సులు 295 రూపాయల దాకా పెట్టుకోవచ్చు. ఎటొచ్చి ఏపీలో ఇది 177 రూపాయలే ఉండటం వల్ల ప్రతిసారి పెంపు కొరక తప్పడం లేదు. కానీ మాస్ జాతరకు అలాంటి రిస్క్ చేయలేదు. విజయవాడ తదితర నగరాల్లో ఓపెన్ చేసిన ప్రీమియర్ షోల బుకింగ్స్ చూస్తే మాములు రేట్లే ఉన్నాయి. అంటే మల్టీప్లెక్స్ లో తెలంగాణలో కంటే వంద తక్కువ ధరలో సినిమా చూసే అవకాశం దక్కడమే కాదు సింగల్ స్క్రీన్‌లో 105 రూపాయల బాల్కనీతో ఎక్కువ శాతం చూసే ఛాన్స్ దక్కింది. నిజానికి మాస్ జాతరకు బడ్జెట్ తక్కువేం కాలేదు. యాక్షన్ బ్యాక్ డ్రాప్ కాబట్టి గట్టిగా ఖర్చు పెట్టారు. యాక్షన్ ఎపిసోడ్లు, క్యాస్టింగ్ కోసం పెద్ద ఎత్తున వ్యయం చేశారు. పైగా క్యాస్టింగ్ కోసం కూడా జేబు తడిసె రేంజ్ లో పారితోషికాలు ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ చూసుకుంటే పెంపు ఈజీగా అడిగి ఉండొచ్చు. కానీ నిర్మాత నాగవంశీ అటువైపు మొగ్గు చూపించలేదు. డిస్ట్రిబ్యూషన్ చేసిన డబ్బింగ్ మూవీ వార్ 2కి తీసుకున్న హైక్స్ ని మాస్ జాతరకు వద్దనుకున్నారు. అంటే ఎక్కువ శాతం ఆడియన్స్ కి రీచ్ అవ్వాలనే ఉద్దేశంతోనే. ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు రవితేజ ఫ్యాన్స్ థాంక్స్ చెప్పడం ఎంతైనా సబబే.

## పా.రంజిత్ కొత్త ప్రయత్నం.. కీలక పాత్రలో అక్కినేని కోడలు

కోలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ పా. రంజిత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సామాజిక అంశాలు, దళితుల పోరాటాలు, అణగారిన వర్గాల అన్యాయాలను బలమైన కథలుగా మలచడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అంబేద్కర్ భావజాలాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజల్లో చైతన్యం రగిలించే చిత్రాలను తెరకెక్కిస్తూ వస్తున్న ఈ దర్శకుడు, ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌తో మళ్లీ వార్తల్లో నిలిచారు. తాజా సమాచారం ప్రకారం, పా. రంజిత్ దర్శకత్వంలో అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ నటించబోతున్నారట. గతేడాది విక్రమ్‌తో 'తంగలాన్' అనే సినిమా తెరకెక్కించిన రంజిత్, ఇప్పుడు కాస్త గ్యాప్ తీసుకుని తన తదుపరి సినిమాపై ఫోకస్ చేస్తున్నారు. ఇంకా అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుందని టాక్ వినిపిస్తోంది. సినిమాకు తాత్కాలికంగా 'వెట్టువం' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సమ్మర్ రిలీజ్ లక్ష్యంగా షూటింగ్ చేస్తున్నారు. ఇటీవలే సినిమా యూనిట్, ప్రధాన తారాగణంతో కలిసి ఓ భారీ వరద సీక్వెన్స్ చిత్రీకరించినట్లు తమిళ వర్గాలు వెల్లడించాయి. ఇందులో 'అట్టకత్తి' ఫేమ్ దినేష్ హీరోగా నటిస్తుండగా, ఆయనకు జోడీగా శోభిత ధూళిపాళ కనిపించనుందని సమాచారం. నాగ చైతన్యను గత సంవత్సరం డిసెంబర్‌లో వివాహం చేసుకున్న తర్వాత శోభిత ఇప్పటివరకు కొత్త ప్రాజెక్ట్ ఏదీ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఆమె అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఓ వెబ్ సిరీస్ చేస్తోందని, అలాగే ఒక సినిమా షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నారని తెలిసింది. మరోవైపు, ఈ సినిమాలో ఆర్య నెగటివ్ రోల్ చేస్తున్నారని తమిళ మీడియా రిపోర్ట్స్ చెబుతున్నాయి. పా. రంజిత్ దర్శకత్వంలో ఆర్య ఇంతకుముందు నటించిన 'సార్పట్టా పరంబరై' ఓటీటీలో ఘనవిజయం సాధించింది. దానికి సీక్వెల్‌గా 'సార్పట్టా 2' చేయాలని భావిస్తున్నా, అంతకంటే ముందుగా రంజిత్ కొత్త ప్రాజెక్ట్ 'వెట్టువం' లో ఆర్యకు విలన్ రోల్ ఇచ్చారని టాక్. పా. రంజిత్–శోభిత ధూళిపాళ–ఆర్య కాంబినేషన్‌లో వస్తోన్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అయితే ఇందులో నిజమెంత అనేది తెలుసుకోవాలంటే, అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.





## యష్ 'టాక్సిక్' వచ్చేది అప్పుడే.. రూమర్స్‌పై చిత్రబృందం క్లారిటీ.!

యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19 2026లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియారా అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,